MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 294 | పేజీలు : 8 | మంగళవారం 13 అక్టోబర్ 2026 | వెల : 6-00



కదం తొక్కిన ప్రతిపక్షం

- సర్‌పై సుప్రీం తలుపుతట్టిన ఇండియా కూటమి
- భారీ ర్యాలీగా వెళ్లి పిటిషన్... నేడు విచారణకు వచ్చే అవకాశం
- జ్ఞానేశ్ నాకు సందేశాలు పంపిస్తున్నారు
- ప్రధాన నేరస్థుడు ఆయన కాదు.. అప్రూవర్‌గా మారాలి
- సీబీఐ, ఈడీ, విదేశాంగ శాఖల్లో 200 మంది అధికారులూ మాతో టచ్‌లో ఉన్నారు
- ప్రభుత్వం నుంచీ నాతో మాట్లాడటానికి ప్రయత్నిస్తున్నారు
- ర్యాలీకి ముందు మీడియాతో రాహుల్ గాంధీ



దిల్లీ

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరిట దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఓట్లను అన్యాయంగా తొలగించారని, ఇతరత్రా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ విపక్ష ఇండియా కూటమి పార్టీలు సోమవారం సుప్రీంకోర్టు తలుపు తట్టాయి. ముందుగా సర్వోన్నత న్యాయస్థానం వరకు నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో సాగిన ఈ మార్చ్‌లో కూటమి పార్టీల నేతలతోపాటు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఇద్దరు కమిషనర్లను పక్కనపెట్టి ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపిస్తూ.. ఆయన రాజీనామా కోసం ఇండియా కూటమి పార్టీలు గత కొద్దిరోజులుగా ఆందోళనను తీవ్రతరం చేశాయి. ఇందులో భాగంగా ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించాయి. తాను వినతిపత్రం స్వీకరించడం భావ్యం కాదని, పిటిషన్ రూపంలో కోర్టును ఆశ్రయించాలని సీజేఐ సూచించిన విషయం తెలిసిందే. ఆ మేరకు కూటమి నేతలంతా ఉమ్మడి పిటిషన్ దాఖలు చేయడానికి కదిలారు. పిటిషన్ (డైరీ నెం.64196/2026)ను రాహుల్, తదితరులు దాఖలు చేశారు. ప్రతివాదులుగా - మిగతా2లో

తిరుపతికి మహర్దిన



అమరావతి, మహానగర్:

ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన తిరుమల--తిరుపతి ప్రాంతాన్ని మరింత అద్భుతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా, ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేలా చేపట్టిన పనులకు ముఖ్య మంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. తిరుపతి

- రూ.3,222 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు
- అలిపిరి వద్ద యాత్రికుల టౌన్‌షిప్‌కు శంకుస్థాపన
- మొదలైన మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులు
- టీటీడీ ఉద్యోగుల నివాస లేఔట్ పనుల ప్రారంభం
- వెంకటాద్రి యాప్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- తుడా-టీటీడీ చేపడుతున్న అభివృద్ధి పనులకు వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, టీటీడీ పరిధిలో రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యాలను కల్పించేందుకు రూ.2,750 కోట్లతో సమీకృత టౌన్‌షిప్ నిర్మాణానికి - మిగతా2లో



ముగిసిన జంతర్ మంతర్ శకం

- చారిత్రక పోరాటాలకు సజీవ సాక్ష్యం
- 1993 జైల్ భరో కార్యక్రమం నుంచి 2026 నీట్ పేపర్ లీకేజీ వివాదాల వరకు ఎన్నో కీలక ప్రజా ఉద్యమాలకు జంతర్ మంతర్ వేదికైంది
- ఇప్పుడు కేంద్ర హోంశాఖ ఆదేశాలతో ప్రస్థానం ముగిసిపోయింది.

5


ఆరు రాష్ట్రాలు.. కొత్త బాధ్యతలు



- కేంద్రం కీలక నిర్ణయం..
- ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు!
- కేరళ నుంచి తమిళనాడుకు అర్లేకర్ బదిలీ..
- కేరళ గవర్నర్‌గా ఓం ప్రకాశ్ మాథూర్
- కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, సిక్కింలకూ కొత్త నియామకాలు

విజయవాడ, మహానగర్

దేశంలోని ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కీలక నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సలహా మేరకు కేరళ, తమిళనాడు, ఒడిశా, కర్ణాటక, ఉత్త రాఖండ్, సిక్కిం రాష్ట్రాలకు సంబంధించి గవర్నర్ల నియామకాలు, బదిలీలపై రాష్ట్రపతి భవన్ ప్రకటన విడుదల చేసింది. ఈ మార్పుల్లో భాగంగా ఇప్పటికే గవర్నర్లుగా పనిచేస్తున్న కొందరికి ఇతర రాష్ట్రాల బాధ్యతలు అప్పగించగా, - మిగతా3లో



బంగాళాఖాతంలో అల్పపీడనం

- దక్షిణ కోస్తా, రాయలసీమకు భారీ వర్ష సూచన
- దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం
- రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం
- అక్టోబర్ 14 నుంచి దక్షిణ కోస్తాంధ్ర, తమిళనాడులో భారీ వర్షాలు
- రాయలసీమ, కేరళ, కర్ణాటకలోనూ విస్తారంగా వానలు
- ఈశాన్య రుతుపవనాల రాకకు అనుకూల పరిస్థితులు

5

విజయవాడ వెస్ట్ బైపాస్‌పై ఘోర ప్రమాదం



విజయవాడ, మహానగర్

విజయవాడ వెస్ట్ బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎలక్ట్రిక్ వాహనం (ఈవీ)లో మంటలు చెలరేగ డంతో నలుగురు సజీవ దహనమయ్యారు.

- నలుగురు సజీవ దహనం!
- ఈవీ కారులో మంటలు చెలరేగి నలుగురి దుర్మరణం..
- మరొకరి పరిస్థితి విషమం
- రోడ్డు రెయిలింగ్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక అంచనా..
- సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి

మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. నంబూరులో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరై తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగినట్లు సమాచారం. ఒకే - మిగతా2లో

భారత్‌లోకి చొరబడేందుకు యత్నం

- మందుపాతర పేలి లష్కరే కీలక కమాండర్ సహా నలుగురు ఉగ్రవాదులు మృతి!
- కృష్ణ ఘాటిలో మందుపాతరల పేలుడులో నలుగురు ఉగ్రవాదులు మృతి
- మృతుల్లో లష్కరే తోయిబా కమాండర్ మహమ్మద్ ఫైజాన్ ఉన్నట్లు సమాచారం
- పూంఛ్ జిల్లాలో ఎల్ఓసీ వెంబడి భద్రత కట్టుదిట్టం
- సత్వాల్-నాకి ప్రాంతంలోనూ పేలుడు కలకలం



5

కదం తొక్కిన ప్రతిపక్షం



-మొదటిపేజీ తరువాయి

ఈసీఐని, సీఈసీని, ఇద్దరు ఎన్నికల కమిషనర్లను చేర్చారు. జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తప్పించాలన్నది విపక్ష నేతల డిమాండ్.ఇప్పటికే దాఖలైన పిటిషన్లు మంగళవారం సీజేఐ ధర్మాసనం ముందు విచారణకు రానున్నాయి. వాటితోపాటు రాహుల్‌గాంధీ తదితరుల పిటిషన్‌పైనా విచారణ చేపట్టే అవకాశం ఉంది. దీనిని దాఖలు చేసినవారిలో మల్లికార్జున ఖర్గే, రాహుల్‌లతో పాటు వివిధ పార్టీల నేతలు సౌగతా రాయ్(తృణమూల్), అఖిలేశ్ యాదవ్ (సమాజ్‌వాదీ), తేజస్వీప్రసాద్‌యాదవ్(ఆర్జేడీ), సంజయ్ రౌత్(శివసేన-యూబీటీ), ఎం.ఎ.బేబీ (సీపీఎం), డి.రాజా(సీపీఐ), మహువా మాఝీ (జేఎంఎం), సుప్రియా సూలె(ఎన్సీపీ-ఎస్‌సీపీ), మహమ్మద్ బషీర్(ఐయూఎంఎల్) ఉన్నారు.
ర్యాలీలో ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ.. తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ సీఎంలు రేవంత్‌రెడ్డి, డి.కె.శివకుమార్, సుఖ్వీందర్ సింగ్ సుఖ్ఖుతోపాటు దేశం నలుమూలల నుంచి వచ్చిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ర్యాలీని భగవాన్‌దాస్ రోడ్డులో పోలీసులు నిలువరించే ప్రయత్నం చేశారు. రాహుల్, ప్రియాంక, తేజస్వి, అఖిలేశ్ తదితర నేతలు ఒక వాహనంపైకి ఎక్కారు. బ్యారికేడ్లు దాటిన తర్వాత ర్యాలీ కొనసాగింది. నేతలు, కార్యకర్తలు మొదట కాన్‌స్టిట్యూషన్ క్లబ్ వద్దకు చేరి, అక్కడి నుంచి బారకంబా రోడ్డు కూడలి మీదుగా ర్యాలీలో చేరడానికి బస్సుల్లో వెళ్లారు.

ఫాం-6పై తీర్పు ఇవ్వలేదు: సుప్రీంకోర్టు

బిహార్ 'సర్' ప్రక్రియ విషయంలో ఎన్నికల కమిషన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కొత్త ఓటర్లు నింపాల్సిన ఫాం-6లో తాము ఎలాంటి సవరణలనూ ఆమోదించలేదని మరోసారి స్పష్టం చేసింది. కొత్త ఫాం డిక్లరేషన్‌కు సుప్రీంకోర్టు ఆమోదం ఉందంటూ ఎన్నికల సంఘం చేసిన ప్రకటనని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తప్పుబట్టింది. చట్టబద్ధమైన నిబంధనలు సవరించకుండా ఫాం-6 లో ఈసీ మార్పులు చేసిందని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. దీనిపై విచారణ జరిపిన సీజేఐ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి ఇతర పిటిషన్లతో కలిపి ఈ నెల 27న విచారణ చేపడతామని తెలిపింది.

పిటిషన్లో ఏముందంటే..

సర్‌కు సంబంధించి తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలపై మిగతా ఎన్నికల కమిషనర్లు వ్యక్తంచేసిన అభ్యంతరాలు; ఈసీఐనెట్, ఈఆర్ఓనెట్ యాక్సెస్ లాగ్స్; దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ మొదలుపెట్టాలని 2025 జూన్ 24న తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన మొత్తం ఫైల్ రికార్డులను కోర్టు ముందుంచేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని విపక్షనేతలు తమ పిటిషన్లో కోరారు.
దానిలో ఇంకా ఏముందంటే..
సర్‌కు సంబంధించిన వివాదాస్పద నిర్ణయాలను రాజ్యాంగం ప్రకారం, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు లోబడే తీసుకున్నారా? లేదా? అన్నది పరిశీలించాలి. చట్టబద్ధమైన అధికారం లేకుండా ఏదైనా నిర్ణయాలు తీసుకొని ఉంటే వాటిని రద్దు చేయాలి. చట్టాలను ఉల్లంఘించేలా నిర్ణయాలుంటే బాధ్యులైన అధికారులపై తగిన చర్యలకు ఆదేశాలు జారీచేయాలి.
ప్రస్తుతం సుప్రీంకోర్టులో పెండింగులో ఉన్న ఈ కేసుతోపాటు, దీంతో ముడిపడిన ఇతర అంశాలపై సుప్రీంకోర్టు తుది ఉత్తర్వులు వెలువడేవరకూ సర్‌కు సంబంధించిన ప్రతి నిర్ణయమూ 2023 చట్టంలోని సెక్షన్ 18కి లోబడే తీసుకోవాలని సీఈసీకి ఆదేశాలు జారీచేయాలి.
చట్టప్రకారం సవరణలు చేసేంతవరకూ ఆన్‌లైన్ ఫాం-6ని రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టార్స్ రూల్స్-1960 కింద పొందుపరిచిన నిబంధనల ప్రకారమే కొనసాగించేలా ఈసీకి ఆదేశాలు ఇవ్వాలి.
ఓట్ల తొలగింపు, మార్పులను పరీక్షించేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, సాంకేతిక నిపుణులు, ప్రముఖ వ్యక్తులతో ఒక స్వతంత్ర కమిటీ ఏర్పాటుచేయాలి. ఈసీఐనెట్, ఈఆర్ఓనెట్‌తోపాటు ఎలక్టోరల్ రోల్ డేటాబేస్‌లో చేసిన సవరణలను పరిశీలించే బాధ్యత ఈ కమిటీకి అప్పగించాలి.
ఈవీఎంల వినియోగం, తరలింపు కోసం ఏర్పాటుచేసిన ఆర్కిటెక్చర్, వాటి సాంకేతిక డిజైన్ విషయంలో ఎన్నికల సంఘం నిర్ణయాలు, విధానాలు, ప్రొటోకాల్స్ పరిశీలించే బాధ్యతనూ అప్పగించాలి.
సర్‌లో తొలగించిన అన్ని పేర్లనూ బూత్‌లవారీగా ప్రకటించేలా ఉత్తర్వులు జారీచేయాలి. అందుకు కారణాలు కూడా ఇవ్వాలి. పేర్లను తిరిగి చేర్చేందుకు సమర్థమైన యంత్రాంగం ఏర్పాటుచేసేలా ఆదేశించాలి.
చట్ట ప్రకారం నోటీసు జారీచేసి, వారి వాదనలు వినేదాకా ఎవరి పేర్లూ తొలగించకుండా ఉత్తర్వులివ్వాలి.
పంజాబ్‌తోపాటు, ఎన్నికలకు వెళ్తున్న ఇతర రాష్ట్రాల్లో చట్టప్రకారం చివరి తేదీవరకూ ఓటర్లను చేర్చేందుకు అనుమతివ్వాలి.
తుది తీర్పు వెలువరించేంతవరకూ సర్ ప్రక్రియను నిలిపేసేలా మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలి.

తిరుపతికి మహర్దశ



-మొదటిపేజీ తరువాయి

సీఎం శంకుస్థాపన చేశారు. తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సురక్షితమైన, ఆధ్యాత్మిక అనుభూతిని అందించేలా తిరుపతిలోని అలిపిరి సమీపంలో ఎస్వీ జూపార్కు రహదారి వద్ద సమీకృత యాత్రికుల టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం రూ.2,750 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో వసతి, అన్నప్రసాదం, విశ్రాంతి, రవాణా, పార్కింగ్, వైద్య సేవలు, డిజిటల్ సమాచార కేంద్రాలు సహా భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకురానున్నారు. భక్తుల వసతి కోసం రూ.1,332 కోట్లతో నాలుగు బ్లాకుల్లో పది అంతస్తుల చొప్పున మొత్తం 2,700 గదులను నిర్మించనున్నారు. వీటి ద్వారా రోజుకు సుమారు 15 వేల మంది భక్తులకు వసతి కల్పించే అవకాశం ఉంది.
తిరుమల కొండపై వసతులపై ఒత్తిడిని తగ్గించడంతోపాటు, తిరుపతిలోనే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. అన్నదానం అత్యంత పవిత్రమైన సేవ అని పేర్కొన్న ముఖ్యమంత్రి... ఆకలితో వచ్చిన భక్తులకు అన్నప్రసాదం, అలసిపోయిన వారికి వసతి కల్పించడం ద్వారా దేవదేవుడికి సేవ చేసినట్లేనని అన్నారు. ఇందులో భాగంగా రూ.160 కోట్లతో నిర్మించనున్న అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భక్తులకు ఆహారాన్ని అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపే బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాన్ని నిర్మిస్తున్నారు. రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన సమీకృత రవాణా టెర్మినల్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

రూ.242 కోట్లతో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారులు

తిరుపతి నగరంలో పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.242 కోట్ల అంచనా వ్యయంతో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. మొత్తం 20 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ పనుల్లో తుడా రూ.127 కోట్లతో 16.50 కిలోమీటర్లు, టీటీడీ రూ.115 కోట్లతో 3.60 కిలోమీటర్ల రహదారులను అభివృద్ధి చేయనున్నాయి. ఈ రహదారులు జాతీయ రహదారులు 140, 71 మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడంతోపాటు, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పించనున్నాయి. శ్రీవారి సేవలో నిరంతరం నిమగ్నమయ్యే టీటీడీ ఉద్యోగుల కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగులు, వారి కుటుంబాలు సొంతింటిలో ఆత్మగౌరవంతో జీవించాలన్న లక్ష్యంతో 418 ఎకరాల్లో నివాస లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. మొదటి, రెండో దశల్లో కలిపి మొత్తం 5,192 మంది ఉద్యోగులకు ఇళ్ల స్థలాల లేఔట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.230 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇందులో టీటీడీ వాటాగా రూ.150 కోట్లు, ఉద్యోగుల వాటా రూ.80 కోట్లు వ్యయం చేయనున్నారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు, నీటి సరఫరా పైప్‌లైన్లు, మురుగునీటి శుద్ధి కేంద్రం, విద్యుత్ పంపిణీ వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. ఈ టౌన్ షిప్ ను పర్యావరణ హితంగా నెట్‌జీరో గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించారు. ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషం ఉంటే వారు మరింత అంకితభావంతో భక్తులకు సేవలందించగలరని సీఎం అన్నారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో సేవాభావంతో పనిచేస్తున్న టీటీడీ సిబ్బందిని అభినందించారు. తిరుమల చరిత్ర, శ్రీవారి వైభవం, ఆధ్యాత్మిక సంప్రదాయాలను భక్తులకు పరిచయం చేసేందుకు పిలిగ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సీఎం దిశానిర్ణ్దేశం చేశారు. డిజిటల్ సమాచార కేంద్రం, అత్యవసర వైద్య సహాయ కేంద్రాలు, ఆధునిక భద్రతా వ్యవస్థలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు తిరుపతి నుంచి వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ సంతృప్తికరమైన అనుభూతిని పొందేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. భక్తులకు సమాచారం తెలిపేందుకు రూపొందించిన వెంకటాద్రి యాప్‌ను సీఎం ఆవిష్కరించారు. తిరుమల తరహా పవిత్రత దిగువన తిరుపతిలోనూ అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తిరుపతిని కేవలం యాత్రా కేంద్రంగా కాకుండా, ఆధ్యాత్మికత, పర్యావరణ పరిరక్షణ, ఆధునిక సాంకేతికత, విద్య, ఉపాధి, పర్యాటకంగా సమన్వయంతో అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.
తిరుపతిలోని చెరువులన్నింటినీ అనుసంధానించి సుందరంగా తీర్చిదిద్దాలని, కల్యాణి డ్యామ్ వరకు ఉన్న ప్రాంతాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఔషధ మొక్కల ప్రాంతాన్ని సందర్శకులకు ఆధ్యాత్మిక, ప్రకృతి అనుభూతిని అందించే ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా అభివృద్ధి చేయాలన్నారు. వృక్షో గోవింద కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, గోశాలల నిర్వహణ, గోసేవను ప్రోత్సహించాలని చెప్పారు. వన్యప్రాణుల సంరక్షణకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్నదానం, ప్రాణదానం, విద్యా దానం వంటి సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. శ్రీవారి సేవకుల తరహాలో ఇతర దేవాలయాల్లోనూ సేవా వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ప్రజలను సన్మార్గంలో నడిపించేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని, ముఖ్యంగా యువతలో ఒత్తిడిని తగ్గించి, ఆధ్యాత్మికత వైపు నడిపించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆధ్యాత్మికతను సాంకేతికతతో కలిపి ముందుకు తీసుకెళ్లాలని, శ్రీవారి వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా మరింతగా చాటిచెప్పే కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. పవిత్రత విషయంలో ఎక్కడా రాజీపడబోమని సీఎం స్పష్టం చేశారు. మెరుగైన కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలతో తిరుపతి త్వరలోనే వివాహ వేడుకలకు ప్రముఖ గమ్యస్థానంగా మారే అవకాశముందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కన్వెన్షన్ హాల్ ఏర్పాటు చేస్తే నగరంలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని చెప్పారు. క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతోపాటు, ఏసీఏ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక యువతకు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు కల్పించాలని, ఉపాధి అవకాశాలు పెంచేలా శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులు, యాత్రికులు తిరుపతిని చూసి రాష్ట్రం గురించి అంచనా వేస్తారని, అందుకే ఈ నగరాన్ని అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. దేవాదాయ, పర్యాటక, పురపాలక శాఖలు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. పురపాలక శాఖ పట్టణాల అభివృద్ధితోపాటు ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థిక కార్యకలాపాలు, ఉపాధి అవకాశాలను పెంచే దిశగా పనిచేయాలని సూచించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, టీటీడీ ఉద్యోగుల సంక్షేమం, తిరుపతి నగర మౌలిక సదుపాయాల విస్తరణ ఈ లక్ష్యాలను సమన్వయం చేస్తూ తిరుపతిని దివ్యక్షేత్రంగా, ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్ర, పాలక మండలి సభ్యులు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, తిరుపతి జిల్లా కలెక్టర్, తుడా అధికారులు తదితరులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు
ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, మహానగర్

ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయొద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అందుతున్న ప్రభుత్వ సేవలపై ఆరా తీశారు. ప్రస్తుతం పీజీఆర్ఎస్ విధానం ద్వారా ప్రజల సమస్యలను వీలైనంత మేరకు పరిష్కరించగలుగుతున్నామని, మరింత వేగంగా, సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించాలని సీఎస్ సాయి ప్రసాద్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆ సమావేశంలో 175 నియోజకవర్గాల నోడల్ అధికారులు ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత వాటిని పరిష్కరించే విషయంలో ఉద్యోగులకు, అధికారులకు జవాబుదారీతనం ఉండేలా చూడాలన్నారు. వివిధ శాఖలపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని... జారీ చేస్తున్న జీవోలను వక్రీకరిస్తూ ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతున్నారన్నారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖ జారీ చేసిన జీవోపై ఈ తరహా దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు సమర్థంగా సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆరు రాష్ట్రాలు.. కొత్త బాధ్యతలు

-మొదటిపేజీ తరువాయి

మరికొందరికి తొలిసారిగా గవర్నర్ పదవులు కేటాయించారు. తాజా నిర్ణయం ప్రకారం సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాశ్ మాథూర్‌ను కేరళ గవర్నర్‌గా నియమించారు. కేరళ గవర్నర్‌గా ఉన్న రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌కు తమిళనాడు బాధ్యతలు అప్పగించారు. ఝార్ఖండ్‌కు చెందిన సీనియర్ నాయకుడు బ్రిజ్ మోహన్ రామ్‌ను ఒడిశా గవర్నర్‌గా నియమించారు. డాక్టర్ సుధా యాదవ్‌కు కర్ణాటక గవర్నర్ బాధ్యతలు అప్పగించగా, డాక్టర్ ధల్‌సింగ్ బిసెన్‌ను ఉత్తరాఖండ్ గవర్నర్‌గా నియమించారు. దుష్యంత్ గౌతమ్‌ను సిక్కిం గవర్నర్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

కేరళ నుంచి తమిళనాడుకు అర్లేకర్

గవర్నర్ల నియామకాల్లో ప్రధాన మార్పుగా కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను తమిళనాడుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సిక్కిం గవర్నర్‌గా పనిచేస్తున్న ఓం ప్రకాశ్ మాథూర్‌ను కేరళకు నియమించారు. దీంతో కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో గవర్నర్ల బాధ్యతల్లో మార్పులు చోటుచేసుకున్నాయి.

కొత్తగా నలుగురికి అవకాశం

ఒడిశా, కర్ణాటక, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకు బ్రిజ్ మోహన్ రామ్, డాక్టర్ సుధా యాదవ్, డాక్టర్ ధల్‌సింగ్ బిసెన్, దుష్యంత్ గౌతమ్‌లను నియమించారు. ఈ నియామకాలతో ఆయా రాష్ట్రాల్లో రాజ్యాంగబద్ధమైన గవర్నర్ పదవులకు కొత్త వ్యక్తులు బాధ్యతలు చేపట్టనున్నారు. గవర్నర్లు రాష్ట్రాల్లో రాజ్యాంగ పరిరక్షణ, శాసనసభ సమావేశాలకు సంబంధించిన రాజ్యాంగపరమైన విధులు, ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన సందర్భోచిత బాధ్యతలు నిర్వహిస్తారు.

బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే అమలు

రాష్ట్రపతి భవన్ ప్రకటన ప్రకారం ఈ నియామకాలు సంబంధిత వ్యక్తులు తమ కొత్త పదవుల బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. కొత్త గవర్నర్లు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయా రాష్ట్రాల్లో రాజ్యాంగబద్ధమైన విధులను నిర్వహించనున్నారు. ఆరు రాష్ట్రాలకు సంబంధించి చేపట్టిన ఈ నియామకాలు, బదిలీలు దేశవ్యాప్తంగా రాజకీయ, పరిపాలనా వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

కొత్త గవర్నర్ల జాబితా

కేరళ -- ఓం ప్రకాశ్ మాథూర్ తమిళనాడు -- రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్
ఒడిశా -- బ్రిజ్ మోహన్ రామ్ కర్ణాటక -- డాక్టర్ సుధా యాదవ్ ఉత్తరాఖండ్ -- డాక్టర్ ధల్‌సింగ్ బిసెన్ సిక్కిం -- దుష్యంత్ గౌతమ్

విజయవాడ వెస్ట్ బైపాస్‌పై ఘోర ప్రమాదం

-మొదటిపేజీ తరువాయి

కుటుంబానికి చెందినవారు సహా నలుగురు ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

రెయిలింగ్‌ను ఢీకొని.. కారులో మంటలు

ప్రాథమిక సమాచారం ప్రకారం.. వెస్ట్ బైపాస్‌పై ప్రయాణిస్తున్న ఎలక్ట్రిక్ కారు రోడ్డు పక్కనున్న రెయిలింగ్‌ను ఢీకొట్టినట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో కారులో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. మంటలు వేగంగా వ్యాపించడంతో అందులో ప్రయాణిస్తున్నవారు బయటపడేందుకు అవకాశం లేకపోయినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అయితే ప్రమాదానికి కచ్చితమైన కారణాలు, మంటలు చెలరేగడానికి దారితీసిన పరిస్థితులపై అధికారిక విచారణ పూర్తికావాల్సి ఉంది. వాహనం రెయిలింగ్‌ను ఢీకొట్టిన తీరు, ప్రమాదం జరిగిన సమయంలోని పరిస్థితులు, అగ్నిప్రమాదానికి గల కారణాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

మృతులు వీరే..

ఈ ప్రమాదంలో నున్నకు చెందిన కొమ్మారెడ్డి రాందేవ్ (39), ఆయన తల్లి కొమ్మారెడ్డి అరుణ (56), కొమ్మారెడ్డి మహాత్ర (1), నంబూరుకు చెందిన తిగురు విజయ (48) మృతి చెందినట్లు గుర్తించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. నంబూరులో జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ప్రమాద వార్త తెలియగానే మృతుల బంధువులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తమవారు విగతజీవులుగా మారడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఆర్తనాదాలతో ఆ ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.


ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

విజయవాడ వెస్ట్ బైపాస్‌పై ఎలక్ట్రిక్ కారులో మంటలు చెలరేగి నలుగురు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
ప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రోడ్డు రెయిలింగ్‌ను కారు ఢీకొట్టడంతో మంటలు చెలరేగినట్లు ప్రాథమికంగా గుర్తించిన విషయాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకొని అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

గాయత్రీదేవిగా దుర్గమ్మ దర్శనం











- భక్తుల భద్రతకు టెక్నాలజీ కవచం
- సౌకర్యవంతమైన దర్శనానికి పటిష్ట ఏర్పాట్లు
- దుర్గమ్మను దర్శించుకున్న విశాఖ ఎంపీ శ్రీభరత్
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ నిరంతర పర్యవేక్షణతో విజయవంతంగా దసరా మహోత్సవాలు

విజయవాడ, మహానగర్

ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో రెండో రోజైన సోమవారం జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ వేదమాత శ్రీ గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి తరలివస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. లక్షలాది మంది భక్తుల రద్దీని నియంత్రించడం, సురక్షితమైన దర్శనం కల్పించడం లక్ష్యంగా ఏఐ కెమెరాలు, డిజిటల్ డిస్‌ప్లేలు, క్యూఆర్ కోడ్ వ్యవస్థలు సహా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. దర్శన సమయ అంచనా, క్యూలైన్ల పర్యవేక్షణ, వాహనాల నియంత్రణ, చిన్నారుల భద్రత, పార్కింగ్, పారిశుద్ధ్యం, వైద్య సేవల నిర్వహణకు సాంకేతిక ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు నిరంతర తాగునీటి సరఫరా, ఉచిత క్లోక్‌రూమ్, పాదరక్షల స్టాండ్లు, ఉచిత ప్రసాద వితరణతోపాటు లడ్డూ కౌంటర్లు, ప్రత్యేక పూజలకు హాజరయ్యే భక్తుల కోసం ఉచిత రవాణా సౌకర్యాలు కల్పించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ క్షేత్రస్థాయిలో, కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ అధికారులకు సూచనలు చేస్తున్నారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యమిస్తూ సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యమని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ తెలిపారు. ఇదిలా ఉండగా, సోమవారం ఉదయం విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్ గాయత్రీదేవి అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకుని, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రశంసించారు. భక్తుల భద్రత, రద్దీ నియంత్రణ, మెరుగైన సేవలే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

బిగ్ బిలియన్ డేస్‌కు భారీ స్పందన

విజయవాడ

పండగల సీజన్‌లో ఆన్‌లైన్ షాపింగ్‌కు దేశవ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తోందని ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ 2026 ప్రారంభ గణాంకాలు వెల్లడించాయి. ఈ విక్రయ కార్యక్రమం 13వ ఎడిషన్ ప్రారంభమైన తొలి గంటలోనే ఒక నిమిషంలో 63 లక్షల మంది ఏకకాల వినియోగదారులు ఫ్లిప్‌కార్ట్‌ను సందర్శించారు. సాధారణ సమయంతో పోలిస్తే తొలి గంటలో ఆరు రెట్లకు పైగా షాపింగ్ జరగగా, కొత్త వినియోగదారుల సంఖ్య 34 శాతం పెరిగింది. మొత్తం 2.87 కోట్లకు పైగా సెషన్లు నమోదయ్యాయి. వీటిలో సుమారు 60 శాతం డిమాండ్ మెట్రోయేతర నగరాల నుంచి వచ్చింది. మొబైల్ ఫోన్ల కొనుగోళ్లలో ఎక్స్ఛేంజ్, నో కాస్ట్ ఈఎంఐ పద్ధతులకు వినియోగదారులు ప్రాధాన్యమిచ్చారు. గత ఏడాదితో పోలిస్తే పెద్ద గృహోపకరణాల అమ్మకాలు 30 శాతం, టాబ్లెట్ల విక్రయాలు 73 శాతం, బ్యూటీ ఉత్పత్తుల అమ్మకాలు 42 శాతం పెరిగాయి. ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ ఆర్డర్లు 3.5 రెట్లు పెరగ్గా, కొత్త వినియోగదారుల సంఖ్య 11 రెట్లు వృద్ధి చెందింది. న్యూఢిల్లీలో ఓ వినియోగదారుడికి ఐఫోన్ 17 కేవలం 3.4 నిమిషాల్లోనే డెలివరీ అయింది. టైర్-2, అంతకంటే చిన్న నగరాల్లోనూ కొనుగోళ్లు, వాయిస్ సెర్చ్‌కు ఆదరణ పెరగడం విశేషం.

జపాన్‌లో దశాబ్దంలో సగానికి తగ్గిన ధూమపానం

విజయవాడ



శాస్త్రీయ ఆధారాలతో రూపొందించిన పొగ రహిత ప్రత్యామ్నాయాలు, సమర్థవంతమైన నియంత్రణ విధానాలు ధూమపానాన్ని తగ్గించడంలో కీలకపాత్ర పోషించగలవని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 30న తాష్కెంట్‌లో నిర్వహించిన టెక్నోవేషన్ తాష్కెంట్ 2026 అంతర్జాతీయ సదస్సులో జపాన్, స్వీడన్, అమెరికా దేశాల అనుభవాలను చర్చించారు. జపాన్‌లో 2014లో సుమారు 20 శాతంగా ఉన్న ధూమపాన రేటు దశాబ్దంలో దాదాపు 10 శాతానికి తగ్గిందని, 2011--2023 మధ్య సిగరెట్ల అమ్మకాలు సగానికి పైగా పడిపోయాయని నిపుణులు పేర్కొన్నారు. వేడి చేసిన పొగాకు ఉత్పత్తుల వినియోగం పెరగడం ఇందుకు ఒక కారణంగా అధ్యయనాలు గుర్తించాయని తెలిపారు. స్వీడన్‌లో సిగరెట్లకు బదులుగా స్నస్, నికోటిన్ పౌచ్‌ల వినియోగం పెరగడంతో 2025 నాటికి రోజువారీ ధూమపానం 3.7 శాతానికి తగ్గిందని వివరించారు. అయితే, ఏ పొగాకు ఉత్పత్తి కూడా పూర్తిగా సురక్షితం కాదని, ధూమపానం మానేయడమే ఉత్తమమని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. పొగాకు నియంత్రణ విధానాలు నిషేధాలకే పరిమితం కాకుండా, స్వతంత్ర శాస్త్రీయ పరిశోధనలు, ప్రజారోగ్య ఆధారాలపై రూపొందాలని సూచించారు. భారతదేశంలో 2016--17 సర్వే ప్రకారం సుమారు 26.7 కోట్ల మంది పొగాకు వినియోగదారులు ఉన్నారని, ఇందులో 9.95 కోట్ల మంది ధూమపానం చేసేవారని వెల్లడించారు. ఇతర దేశాల అనుభవాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని వక్తలు ప్రభుత్వాలకు సూచించారు.

కోర్టెవా '2 మిలియన్ ఉమెన్' కార్యక్రమానికి రెండేళ్లు

విజయవాడ

భారత వ్యవసాయ రంగంలో మహిళా సాధికారతే లక్ష్యంగా కోర్టెవా అగ్రిసైన్స్ ప్రారంభించిన '2 మిలియన్ ఉమెన్' కార్యక్రమం రెండేళ్లు పూర్తి చేసుకుంది. 2024 సెప్టెంబర్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా 2030 నాటికి వ్యవసాయ రంగంలో మహిళలకు సాధికారత కల్పించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు 22 రాష్ట్రాల్లో 7.95 లక్షల మందికి పైగా చేరుకోగా, వారిలో 6.37 లక్షల మందికి పైగా మహిళలు ఉన్నారు. సుమారు 49 వేల మంది మహిళలు నాయకులుగా, సామాజిక మార్పు ప్రతినిధులుగా ఎదిగారు. 90 వేల మందికి పైగా రైతులకు శిక్షణ అందించగా, 1.54 లక్షలకు పైగా జీవనోపాధులను బలోపేతం చేశారు. 1.71 లక్షల హెక్టార్లకు పైగా భూమిలో మెరుగైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించారు. మధ్యప్రదేశ్‌లోని ఉమరియా జిల్లాలో మహిళలు మహువా పువ్వులతో పోషక విలువలున్న లడ్డూలను తయారు చేస్తూ పారిశ్రామికవేత్తలుగా ఎదగడం ఈ కార్యక్రమ ప్రభావానికి నిదర్శనంగా నిలిచింది. మహిళలకు నైపుణ్యాలు, జ్ఞానం, మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచడంతోపాటు గ్రామీణ కుటుంబాలు, రైతు సంఘాలు, సమాజాలను బలోపేతం చేస్తున్నామని కోర్టెవా ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులోనూ మహిళల నాయకత్వాన్ని, వ్యవసాయ రంగంలో వారి భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

రాహుల్ శతకం.. పటిష్ట స్థితిలో ఆంధ్ర

విజయవాడ స్పోర్ట్స్, మహానగర్



మూలపాడులో ఆంధ్ర--కర్ణాటక జట్ల మధ్య జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో రెండో రోజు ఆంధ్ర జట్టు ఆధిపత్యం ప్రదర్శించింది. ఎస్‌వీ రాహుల్ శతకం, రేవంత్ రెడ్డి కీలక ఇన్నింగ్స్‌తో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర ఆరు వికెట్ల నష్టానికి 331 పరుగులు సాధించింది. రాహుల్ 187 బంతుల్లో 10 ఫోర్లతో 108 పరుగులు చేసి సెంచరీతో ఆకట్టుకోగా, రేవంత్ రెడ్డి 143 బంతుల్లో 13 ఫోర్లతో 97 పరుగులు చేసి తృటిలో శతకాన్ని చేజార్చుకున్నారు. ఇద్దరూ బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేస్తూ జట్టుకు విలువైన పరుగులు అందించారు. కర్ణాటక బౌలర్లలో శిఖర్ శెట్టి మూడు వికెట్లు పడగొట్టగా, మాధవ్ బజాజ్ రెండు, రితేష్ బతకల్ ఒక వికెట్ సాధించారు. కర్ణాటక బౌలర్లు వికెట్లు తీసేందుకు ప్రయత్నించినప్పటికీ, ఆంధ్ర బ్యాటర్లు కీలక భాగస్వామ్యాలతో జట్టు స్కోరును 300 పరుగులు దాటించారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర పటిష్ట స్థితిలో నిలవడంతో మూడో రోజు మ్యాచ్ కీలకంగా మారింది. ఆంధ్ర బ్యాటర్లు ఆధిపత్యాన్ని కొనసాగిస్తారా, కర్ణాటక బౌలర్లు పుంజుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో తపస్వికి ద్వితీయ స్థానం



ఆగిరిపల్లి, మహానగర్

గ్రామానికి చెందిన కోసూరు తపస్వి 39వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి యోగా ఛాంపియన్‌షిప్--2026లో ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ నెల 10, 11 తేదీల్లో కావలిలోని పీహెచ్ఆర్ఆర్ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో వాల్మీకి యోగా కేంద్రం, రోటరీ క్లబ్ కావలి సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పాల్గొన్న క్రీడాకారుల మధ్య 24 నుంచి 30 ఏళ్ల వయస్సు విభాగంలో తపస్వి తన యోగా నైపుణ్యాన్ని ప్రదర్శించి రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. యోగా గురువు మొలుగుమాటి జ్యోతికుమారి మార్గదర్శకత్వంలో ఆమె ఈ విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా తపస్వి డిసెంబర్ 7న జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొనేందుకు అర్హత పొందింది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపిక కావడంపై ఆగిరిపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ తపస్వికి అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలోనూ విజయం సాధించి గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నగరంలో తొలిసారిగా జాతీయ సరస్ మేళా

ఈ నెల 15న ప్రారంభించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
30కి పైగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 1,500 మందికి పైగా మహిళా వ్యాపారవేత్తలు



విజయవాడ, మహానగర్

గ్రామీణ మహిళా వ్యాపారవేత్తల ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో మార్కెట్ అవకాశాలు కల్పించే లక్ష్యంతో జాతీయ సరస్ మేళాను నగరంలో తొలిసారిగా నిర్వహిస్తున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించే ఈ మేళా అక్టోబర్ 13 నుంచి 31 వరకు పున్నమి ఘాట్‌లో జరగనుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 15న ఉదయం 11.30 గంటలకు ప్రారంభించనున్నారు. గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొననున్నారు. దేశవ్యాప్తంగా 30కి పైగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 1,500 మందికి పైగా మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించనున్నారు. పంజాబ్ ఫుల్కారీ, కశ్మీర్ పష్మీనా, తెలంగాణ ఇకత్, డోక్రా కళాకృతులు, హస్తకళలు, సంప్రదాయ వస్త్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. వివిధ ప్రాంతాల వంటకాల కోసం 50 ఆహార కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 'లఖ్‌పతి దీదీ', నాలెడ్జ్, కన్వర్జెన్స్, డెమో పెవిలియన్ల ద్వారా మహిళలకు వ్యాపారాభివృద్ధి, ప్యాకేజింగ్, మార్కెటింగ్, నైపుణ్యాలపై అవగాహన కల్పించనున్నారు. 2029 నాటికి ఆరు కోట్ల మంది మహిళలను లఖ్‌పతి దీదీలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యానికి ఈ మేళా దోహదపడనుంది. దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0తో పాటు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు వేదిక కానుంది.

హిమాలయ బేబీకేర్ కొత్త ప్రచార చిత్రం ఆవిష్కరణ



విశాఖపట్నం, మహానగర్

ప్రముఖ హెర్బల్ హెల్త్‌కేర్ బ్రాండ్ హిమాలయ బేబీకేర్ తన 'జెంటిల్ బేబీ వాష్' ఉత్పత్తి కోసం 'పెహ్లే స్పర్శ్ కే లియే పెహ్లా భరోసా' (మొదటి స్పర్శకు తొలి నమ్మకం) నినాదంతో నూతన జాతీయ ప్రచారాన్ని ప్రారంభించింది. నవజాత శిశువు తొలి స్నానం నేపథ్యంలో రూపొందించిన ఈ యాడ్ ఫిల్మ్‌లో కొత్త తల్లి, నర్సు మధ్య జరిగే సంభాషణ ద్వారా శిశువు సున్నితమైన చర్మ సంరక్షణపై తల్లిదండ్రులకు భరోసా కల్పించే ప్రయత్నం చేశారు. ఈ బేబీ వాష్‌లో సబ్బు రహిత, కళ్లలో నీరు తెప్పించని ఫార్ములాతో పాటు పీహెచ్ 5.5 సమతుల్యత, పెసర్లు, శనగలు, మెంతుల సారాలు ఉన్నాయని సంస్థ తెలిపింది. హిమాలయ వెల్‌నెస్ బేబీకేర్ విభాగం డైరెక్టర్ చక్రవర్తి ఎన్.వి. మాట్లాడుతూ, ఆయుర్వేద విజ్ఞానం, శాస్త్రీయ పరిశోధనల సమ్మేళనంతో రూపొందించిన ఉత్పత్తులు తల్లిదండ్రులకు నమ్మకాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ సహా ఎనిమిది భాషల్లో ఈ ప్రచార చిత్రాన్ని విడుదల చేసినట్లు సంస్థ వెల్లడించింది.

వోల్వో తొలి సాఫ్ట్‌వేర్ ఆధారిత విద్యుత్ ఎస్‌యూవీ



విజయవాడ, మహానగర్

వోల్వో కార్ ఇండియా తన తొలి సాఫ్ట్‌వేర్ ఆధారిత విద్యుత్ వాహనం ఈఎక్స్90 లగ్జరీ ఎస్‌యూవీని భారత మార్కెట్లో విడుదల చేసింది. ఆరు సీట్లతో రూపొందించిన ఈ కారు ప్రారంభ ఎక్స్‌షోరూమ్ ధరను రూ.1.26 కోట్లుగా నిర్ణయించింది. డిసెంబర్ 31, 2026లోపు బుకింగ్ చేసుకునే వారికి 11 కిలోవాట్ల వాల్‌బాక్స్ ఛార్జర్, మూడేళ్ల సర్వీస్ ప్యాకేజీతో పాటు మూడేళ్ల తర్వాత 65 శాతం బైబ్యాక్ ఆఫర్ అందించనుంది. డెలివరీలు 2027 జనవరి నుంచి ప్రారంభమవుతాయి. 106 కిలోవాట్ అవర్ బ్యాటరీతో పనిచేసే ఈ వాహనం డబ్ల్యూఎల్‌టీపీ ప్రమాణాల ప్రకారం ఒక్కసారి ఛార్జింగ్‌తో 625 కిలోమీటర్ల ప్రయాణిస్తుంది. 456 హార్స్‌పవర్ శక్తితో 5.5 సెకన్లలో గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. 14.5 అంగుళాల టచ్‌స్క్రీన్, గూగుల్ మ్యాప్స్, వైర్‌లెస్ ఆపిల్ కార్‌ప్లేతో పాటు అధునాతన భద్రతా వ్యవస్థలు ఉన్నాయి. 25 స్పీకర్ల ఆడియో వ్యవస్థ, పనోరమిక్ సన్‌రూఫ్ వంటి విలాసవంతమైన సదుపాయాలు కల్పించారు. ఈఎక్స్90తో పాటు ఈఎస్90 విద్యుత్ సెడాన్‌ను కూడా సంస్థ పరిచయం చేసింది.

మహానగర్

జ్ఞానేశ్ ఇష్యూలో కాక్రోచ్‌లకు కాంగ్రెస్ షాక్

కాక్రోచ్ జనతా పార్టీ నుంచి కాంగ్రెస్‌ను కాపాడుకునేందుకు రాహుల్ వేస్తున్న ఎత్తుగడలు ప్రస్తుతానికి తిరుగులేని ఫలితాలనిస్తున్నాయి. నీట్ పేపర్ లీకేజీ ఉద్యమం సందర్భంగా జంతర్ మంతర్ వద్ద బైఠాయించి, ఏకంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కారణమైన కాక్రోచ్ జనతా పార్టీ విపక్ష స్పేస్‌లో అప్పట్లో భారీ మైలేజీని కొల్లగొట్టింది. విద్యార్థి, యువజన ఉద్యమాలను తమ ఖాతాలో వేసుకుంటూ ఆ పార్టీ సృష్టించిన ప్రభంజనం కాంగ్రెస్ ఉనికికే సవాలుగా నిలిచింది. సరిగ్గా అదే అనుభవాన్ని దృష్టిలో పెట్టుకున్న హస్తం పార్టీ అగ్రనాయకత్వం.. కేంద్ర ఎన్నికల సంఘం వివాదంలో ఆ తప్పు మళ్లీ జరగకూడదని పక్కా వ్యూహంతో బరిలోకి దిగింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను టార్గెట్ చేస్తూ కాక్రోచ్‌లు మొదలుపెట్టిన నిరసన స్వరాన్ని కాంగ్రెస్ తెలివిగా తన అధీనంలోకి తీసుకుంది.ప్రస్తుతం జాతీయ మీడియాలోనూ, సోషల్ మీడియా ట్రెండ్స్‌లోనూ కేవలం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల గురించే చర్చ సాగుతోంది. ఆకాశవాణి భవన్ ఆవరణలో 9 గంటల పాటు చెట్టు కింద బైఠాయించడం, జంతర్ మంతర్ వద్ద ప్రియాంక గాంధీ నడిరోడ్డుపై పడుకుని నిరసన తెలపడం, రాహుల్ గాంధీ ఎఫ్ఐఆర్‌లు నా మెడల్స్ అంటూ దూకుడుగా స్టేట్‌మెంట్లు ఇవ్వడం వంటి పరిణామాలు కాక్రోచ్ పార్టీ పిలుపునిచ్చిన ఆందోళనలను పూర్తిగా నీరుగార్చాయి. కేవలం నిరసనలకే పరిమితం కాకుండా.. రోజూ ఏపీలోని పార్లమెంట్ సభ్యుల నుంచి మొదలుకొని అగ్రనేతల వరకు ఎవరు ఎప్పుడు రోడ్డెక్కాలి, ఎక్కడ డిటెన్షన్ కావాలనే పక్కా డైలీ షెడ్యూల్‌ను కాంగ్రెస్ ముందే సిద్ధం చేసుకుని నడిపిస్తోంది. ఫలితంగా, ఉద్యమ పార్టీగా పేరున్న కాక్రోచ్‌ల నిరసనలకు మీడియాలో కనీస ప్రాధాన్యత కూడా దక్కని పరిస్థితి తలెత్తింది.ధర్మేంద్ర ప్రధాన్ వ్యవహారంలో ఆ ఘనత మొత్తం కాక్రోచ్‌ల ఖాతాలోకి వెళ్లిపోవడంతో చేతులు కాలిన కాంగ్రెస్.. జ్ఞానేశ్ కుమార్ ఇష్యూలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఒకవేళ భవిష్యత్తులో రాజకీయ ఒత్తిళ్ల కారణంగా సీఈసీ రాజీనామా చేయడమో లేక కేంద్రం దిగిరావడమో జరిగితే.. ఆ విజయం కేవలం కాంగ్రెస్ పార్టీ , ఇండియా కూటమి పోరాటం వల్లే సాధ్యమైందనే నేరేటివ్‌ను ప్రజల్లో బలంగా నాటడమే రాహుల్ టీమ్ అసలు లక్ష్యం. సీఈసీ అంశంపై తాము రోడ్లపైకి వచ్చి అరెస్టులు కావడం ద్వారా.. కాక్రోచ్ పార్టీని కేవలం అండర్‌గ్రౌండ్ కార్యకర్తల స్థాయికే పరిమితం చేసి, తామే అసలైన ప్రజాస్వామ్య పోరాట శక్తులమని దేశానికి చాటడంలో కాంగ్రెస్ వ్యూహం ముందడుగు వేసింది.ఈ ఆధిపత్య పోరులో కాక్రోచ్‌లు అంత సులభంగా వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. అక్టోబర్ 10న జంతర్ మంతర్‌ను భారీ ఎత్తున ముట్టడిస్తామని వారు ఇప్పటికే గడువు విధించి, తమ శ్రేణులను ఢిల్లీకి తరలించే సన్నాహాల్లో ఉన్నారు. కానీ, ఆ ముట్టడి రోజున కూడా కాంగ్రెస్ ఊరికే కూర్చునే అవకాశం కనిపించడం లేదు. అప్పటికే పార్లమెంట్ సభ్యులు, కూటమి సీనియర్ నేతలతో కలిసి మరింత పెద్దఎత్తున ప్రత్యక్ష నిరసనలను హోరెత్తించి, కాక్రోచ్‌ల కార్యక్రమాన్ని పూర్తిగా హైజాక్ చేయడానికి కాంగ్రెస్ గ్రౌండ్‌వర్క్ సిద్ధం చేస్తోంది. బీజేపీతో నేరుగా తలపడటంతో పాటు.. విపక్ష స్థానాన్ని ఆక్రమించాలనుకుంటున్న కాక్రోచ్‌లను వెనక్కి నెట్టి, తనే ఏకైక ప్రత్యామ్నాయ శక్తి అని నిరూపించుకోవడమే కాంగ్రెస్ అసలు రాజకీయ పోరాటంగా మారిం జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఢిల్లీ ముట్టడికి పిలుపునిచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేతో పాటు ముఖ్య నేతలు సౌరభ్ దాస్, అశుతోష్ రాంకాలను కోర్టు విడుదల చేసింది. శనివారం విమానం దిగగానే విమానాశ్రయం నుంచే వారిని ముందస్తుగా కస్టడీలోకి తీసుకున్న పోలీసులు, ఆదివారం ఉదయం ఢిల్లీ క్యాంట్ మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టారు. ఏడాది పాటు దేశంలో ఎలాంటి శాంతిభద్రతల విఘాతానికి లేదా శాంతిభంగానికి పాల్పడకూడదనే కఠిన షరతుపై రూ.50,000 ముందస్తు బెయిల్ బాండ్‌తో కోర్టు వారికి ఉపశమనం కల్పించింది.ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ సిజెపి ఈ ఆందోళనకు పిలుపునిచ్చింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాలని భావించినప్పటికీ, పోలీసులు విమానాశ్రయంలోనే దిప్కే బృందాన్ని అదుపులోకి తీసుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. విమానం లోపలికే వచ్చి పోలీసులు తమను అరెస్టు చేస్తున్న దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన దిప్కే, ఇది అప్రజాస్వామిక చర్య అని మండిపడ్డారు.జంతర్ మంతర్ వద్ద జనం గుమిగూడకుండా నగరవ్యాప్తంగా భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసిన ఢిల్లీ పోలీసులు, నిరసనకారులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. శనివారం నాటి ఆందోళనల్లో పలువురు ప్రముఖ రాజకీయ నాయకులతో పాటు సుమారు 3,000 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని అర్ధరాత్రి వేళ విడుదల చేశారు. యూట్యూబర్ ధ్రువ్ రాఠీని కూడా శనివారం రాత్రి పొద్దుపోయాక పోలీసులు విడుదల చేశారు.సిజెపి అగ్రనేతలు విడుదలైనప్పటికీ, ఢిల్లీ వ్యాప్తంగా ఇంకా పోలీసుల పహారా కొనసాగుతోంది. రాజధానిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండటానికి ముందుజాగ్రత్త చర్యలు కొనసాగిస్తున్నామని అధికారులు తెలిపారు. మరోవైపు, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్నారని విమర్శిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ నేతలు తమ పోరాటాన్ని చట్టబద్ధంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

తమిళనాడు రాజకీయ వాతావరణంలో అపూర్వమైన మార్పు

దక్షిణాది రాజకీయాల్లో, ముఖ్యంగా తమిళనాట గత కొన్ని దశాబ్దాలుగా కనిపిస్తూ వస్తున్న ఒక సంప్రదాయానికి ప్రస్తుత పరిణామాలు పూర్తి భిన్నంగా నిలుస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ తమిళనాడులో పర్యటించిన ప్రతిసారీ రాజకీయ ఉద్రిక్తత, వ్యతిరేకత సర్వసాధారణంగా జరిగేది. ప్రతిపక్షాలు, కొన్ని ప్రత్యేక సంఘాలు గో బ్యాక్ మోదీ అంటూ నినాదాలు చేయడం, ఆకాశంలో నల్ల బెలూన్లు ఎగరేయడం, రోడ్లపై నల్లజెండాలతో నిరసనలు తెలపడం ఆనవాయితీగా వస్తోంది. కానీ, తాజాగా చెన్నై మెట్రో ఫేజ్-2 ప్రారంభోత్సవం , వివిధ అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం ప్రధాని మోదీ రాష్ట్రంలో పర్యటించిన తీరును పరిశీలిస్తే, తమిళనాడు రాజకీయ వాతావరణంలో అపూర్వమైన మార్పు వచ్చినట్లు స్పష్టమవుతోంది.ఈ సారి ప్రధాని పర్యటనలో ఎలాంటి నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు జరగలేదు చివరికి ఎప్పుడూ వ్యతిరేకించే డీఎంకే సహా ఏ ఇతర రాజకీయ పార్టీ , సంఘం కూడా మోదీ టూర్‌ను వ్యతిరేకిస్తూ నల్లజెండాలు ప్రదర్శించలేదు. ఎయిర్‌పోర్టులో ముఖ్యమంత్రి సీ. జోసెఫ్ విజయ్ స్వయంగా ప్రధానికి ఘనంగా స్వాగతం పలకడం, ఆ తర్వాత ఇద్దరు నేతలు కలిసి ఒకే వేదికపై కనిపించడమే కాకుండా మెట్రో రైలులో కలియతిరగడం వంటి పరిణామాలు రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరిచాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పర్యటన ముగియడం తమిళ రాజకీయాల్లో కొత్త ఒరవడికి నాంది పలికింది.ఈ మౌనానికి, నిరసనల విరమణకు రాజకీయ సమీకరణాలే ప్రధాన కారణం. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలనే కోణంలో అధికార పక్షం వ్యవహరిస్తున్న తీరు ఇందుకు అద్దం పడుతోంది. కేవలం రాజకీయ విమర్శలు, ఎడతెగని వ్యతిరేకత కంటే రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి ప్రాజెక్టుల సాధనే ముఖ్యమనే భావన క్రమంగా బలపడుతోంది. గతంలో మాదిరిగా కేంద్ర నాయకత్వంపై అనవసరమైన ప్రతిఘటనను పక్కనపెట్టి, ప్రజా సంక్షేమం, మెట్రో వంటి బృహత్తర ప్రాజెక్టుల భాగస్వామ్యం వైపు రాష్ట్ర నాయకత్వం మొగ్గుచూపడం తమిళనాట వస్తున్న సానుకూల మార్పుకు నిదర్శనం.బీజేపీని సంప్రదాయంగా వ్యతిరేకించే డీఎంకేలోనూ మార్పు వచ్చింది. అలా వ్యతిరేకించినా ప్రయోజనం లేకపోవడంతో సైలెంట్ అయిపోయింది. రాబోయే కాలంలో తమిళనాడు రాజకీయ ముఖచిత్రం ఏ విధంగా మారబోతుందో చెప్పడానికి ప్రధాని మోదీ ఈ తాజా పర్యటన ఒక బలమైన సంకేతంగా నిలిచిందని అనుకోవచ్చు.

తెలుగు గంగ నీటిపై చర్చలు



తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వస్తున్న తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ పర్యటన తెలుగు, తమిళ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. ప్రతిష్టాత్మక విజయవాడ ఉత్సవ్ 2.0 సాంస్కృతిక వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్య అతిథిగా విజయ్ విచ్చేస్తున్నప్పటికీ.. ఈ పర్యటనకు చాలా ప్రాధాన్యత ఉంది. ఇరు రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న అంతర్రాష్ట్ర సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో విజయ్ ప్రత్యేకంగా చర్చలు జరపనున్నారు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కూడా సీఎం విజయ్ ముఖాముఖి భేటీ కానున్నారు.ఈ భేటీలో ప్రధానంగా చర్చకు రానున్న అంశం తెలుగు గంగ నీటి పంపకాలు. చెన్నై నగర దాహార్తిని తీర్చేందుకు ఉద్దేశించిన చారిత్రక ఒప్పందం ప్రకారం తమిళనాడుకు సరైన కోటాలో కృష్ణా జలాలు అందడం లేదన్న అసంతృప్తి చెన్నై వర్గాల్లో బలంగా ఉంది. కండలేరు రిజర్వాయర్ నుంచి పూండికి చేరాల్సిన నీటి పరిమాణంలో ఏర్పడుతున్న సాంకేతిక, క్షేత్రస్థాయి అడ్డంకులు, కాల్వల నిర్వహణ, బకాయిలు వంటి సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ ఉన్నత స్థాయి సమావేశం వేదిక కానుంది. తమిళనాడు ప్రజల తాగునీటి అవసరాలకు సంబంధించిన ఈ సున్నితమైన అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని సీఎం విజయ్ ఏపీ ప్రభుత్వాన్ని కోరనుండగా.. పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలు కాంక్షించే చంద్రబాబు సైతం దీనిపై సానుకూల రోడ్‌మ్యాప్‌ను ప్రతిపాదించే అవకాశముంది.నీటి సమస్యలతో పాటు ఈ భేటీకి అత్యంత బలమైన జాతీయ రాజకీయ ప్రాధాన్యత కూడా ఉంది. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న వేళ.. ప్రతిపాదిత లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యాన్ని కోల్పోతాయన్న భయం నెలకొంది. ఈ కీలక అంశంపై దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం కలగకుండా కేంద్రంతో సమన్వయం చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పటికే ప్రయత్నాలు సాగిస్తున్నారు. విజయ్-చంద్రబాబుల చర్చల్లో డీలిమిటేషన్ అంశం ప్రధాన ఎజెండాగా మారనుందని, దక్షిణాది రాజకీయ స్వరాన్ని ఢిల్లీ వేదికగా బలంగా వినిపించేందుకు ఒక ఉమ్మడి కార్యాచరణపై అభిప్రాయాలు పంచుకునే వీలుందని భావిస్తున్నారు.ఇద్దరు సూపర్ స్టార్లు విజయ్ ? పవన్ కల్యాణ్ భేటీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సినిమా రంగంలో అగ్ర హీరోలుగా వెలుగొంది, ప్రజా సమస్యలపై పార్టీలను స్థాపించి ఎన్నికల సమరంలో విజయం సాధించిన ఈ ఇద్దరు నాయకుల ఆలోచనలు, సిద్ధాంతాలు, దక్షిణాది యువత సాధికారత అంశాలు ఈ చర్చల్లో ప్రస్తావనకు వచ్చే వీలుంది. అటు సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొంటూనే, ఇటు కీలకమైన అంతర్రాష్ట్ర వివాదాలు, జాతీయ రాజకీయ సమీకరణాలపై విస్తృత చర్చలు జరపడం ద్వారా సీఎం విజయ్ అమరావతి పర్యటన సరికొత్త సమీకరణాలకు నాంది పలికేలా కనిపిస్తోంది.

టార్గెట్ 100 గిగావాట్ పవర్



న్యూఢిల్లీ : వికసిత్ భారత్ లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి. 2047 బ్లూ ప్రింట్ రెడీ చేసిన కేంద్రం.. దానికి తగ్గట్లుగా చర్యలు చేపడుతోంది. అభివృద్ధికి విద్యుత్ ముఖ్యం.. అది కూడా భారీగా కావాలి. అందుకు తగినట్లుగా అణువిద్యుత్ పై కేంద్రం ఫోకస్ పెట్టింది.2047 నాటికి దేశంలో 100 గిగావాట్ల అణు విద్యుత్ సామర్థ్యాన్ని సాధించడమే లక్ష్యంగా ప్రైవేట్ రంగానికి ద్వారాలు తెరిచినట్లు అణుశక్తి కమిషన్ చైర్మన్ అజిత్ కుమార్ మొహంతి వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రైవేట్ కంపెనీలు 7.5 లక్షల కోట్ల మేర పెట్టుబడులు పెట్టి, 30 గిగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయని పేర్కొన్నారు.ప్రస్తుతం భారత్‌లో 9 గిగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉండగా, ప్రభుత్వ సంస్థ ఔఖఅఎఒ 24 రియాక్టర్లను నడుపుతోంది. మరో 17 రియాక్టర్ల నిర్మాణం జరుగుతోంది. అణురంగాన్ని వేగవంతం చేసేందుకు తెచ్చిన శాంతి చట్టంతో ప్రైవేట్ కంపెనీల ప్రవేశానికి మార్గం సుగమమైందని ఐదేళ్లలో ప్రైవేట్ సంస్థలూ రియాక్టర్లను నిర్వహిస్తాయని ంఇఅ తెలిపింది. ఒక మెగావాట్ అణు విద్యుత్ ఉత్పత్తికి 25 కోట్లు ఖర్చవుతుందని, ఉక్కు, సిమెంట్, భారీ పరిశ్రమల అవసరాలకు స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల తయారీని ప్రభుత్వం పరిశీలిస్తోంది.“ప్రభుత్వ రంగ సంస్థ అయిన ‘న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్’ ప్రస్తుతం 24 రియాక్టర్లను నిర్వహిస్తోంది. ప్రైవేట్ సంస్థలు కూడా అణు విద్యుత్ రంగంలోకి రావాలని భావిస్తున్నాం. అందుకే కొత్తగా శాంతి చట్టాన్ని తీసుకువచ్చాం. రాబోయే ఐదేళ్లలో ఒకటి రెండు ప్రైవేట్ రంగ సంస్థలు రియాక్టర్లను నిర్వహిస్తాయని ఆశిస్తున్నాను. 2047 నాటికి వారి నుంచి సుమారు 30 ఉచి విద్యుత్ ఉత్పత్తి అవుతుందని మేము అంచనా వేస్తున్నాం. 1 ఓచి విద్యుత్ ఉత్పత్తికి సుమారు రూ. 25 కోట్ల ఖర్చు అవుతుంది” అని మొహంతి పేర్కొన్నారు.దేశీయ వనరైన థోరియంను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా భారత్ మూడంచెల అణు కార్యక్రమాన్ని వేగవంతం చేస్తోంది. మొదటి దశలో యురేనియం ఇంధనంగా వాడే రియాక్టర్లను ఉపయోగిస్తారు. ఇవి పనిచేస్తున్నప్పుడు విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంతో పాటు, ప్లూటోనియం-239ను కూడా ఉత్పత్తి చేయగలవు. వాడిన అణు ఇంధనాన్ని పునఃప్రక్రియ చేయడం ద్వారా దీనిని తిరిగి పొందవచ్చని మొహంతి అన్నారు. ఇలా తిరిగి పొందిన ప్లూటోనియంను ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ టెక్నాలజీ ఆధారంగా రెండో దశలో ఉపయోగిస్తారు. ఈ దశ అదనపు విచ్ఛిన్న పదార్థాల ఉత్పత్తికి మద్దతు ఇవ్వడానికి, చివరికి థోరియం వినియోగాన్ని సులభతరం చేయడానికి రూపొందించిందని అన్నారు. “మూడో దశలో థోరియంను అణు ఇంధనంగా ఉపయోగపడే విచ్ఛిన్న పదార్థంగా మార్చాలని భావిస్తున్నారు. థోరియంను ముందుగా తగిన విచ్ఛిన్న పదార్థంగా మార్చకుండా నేరుగా సంప్రదాయ రియాక్టర్ ఇంధనంగా ఉపయోగించలేరు. ఈ సాంకేతిక సవాలును అధిగమించి, దేశీయ వనరులను మరింతగా ఉపయోగించుకునే అణు ఇంధన చక్రానికి అంతిమంగా మద్దతు ఇవ్వడానికే భారత్ మూడు- దశల కార్యక్రమాన్ని రూపొందించింది.” అని మొహంతి అన్నారు.మోనజైట్ కలిగిన సముద్రతీర ఇసుకతో ముడిపడిన థోరియం వనరులు భారతదేశంలో గణనీయంగా ఉన్నాయి. “ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌తో సహా తీర రాష్ట్రాల్లో సముద్రతీర ఇసుక ఖనిజ నిక్షేపాలు ఉన్నాయి. వాటి నుంచి మోనజైట్‌ను వెలికితీయవచ్చు. వాటి నుంచి సరైన ప్రక్రియ ద్వారా థోరియంను తిరిగి పొందవచ్చు. ప్రపంచ థోరియం నిల్వల్లో 25 శాతం భారతదేశంలోనే ఉన్నాయి.” అని ఆయన తెలిపారు.ఈ క్రమంలో తమిళనాడులోని కల్పక్కంలో స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ విజయవంతంగా క్రిటికాలిటీని సాధించింది. ఇది అందుబాటులోకి వస్తే రష్యా తర్వాత వాణిజ్య ప్రాతిపదికన ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్‌ను నిర్వహిస్తున్న రెండో దేశంగా భారత్ చరిత్ర సృష్టించనుంది.

ముగిసిన జంతర్ మంతర్ శకం

ఒకప్పుడు ఆకాశంలోని గ్రహాల గమనాన్ని, కాలాన్ని లెక్కించడానికి కట్టిన చరిత్రాత్మక కట్టడం అది. కానీ కాలక్రమేణా ప్రజల బాధలు, సమస్యలను పాలకులకు వినిపించే శక్తిమంతమైన నిరసనల వేదికగా మారిపోయింది. అదే దేశ రాజధానిలోని జంతర్ మంతర్. ప్రభుత్వంపై తమకున్న అసంతృప్తిని లేదా డిమాండ్లను దేశవ్యాప్తంగా చాటిచెప్పాలనుకునే కోట్లాది మంది ప్రజల ఆశల చిరునామా ఇది. గడిచిన కొన్ని దశాబ్దాలుగా భారత ప్రజాస్వామ్య చరిత్రలో జరిగిన ఎన్నో చరిత్రాత్మక నిరసనలకు ఈ ప్రాంగణమే సజీవ సాక్ష్యంగా నిలిచింది.

దేశవ్యాప్తంగా అవినీతికి వ్యతిరేకంగా ఒక విప్లవమే సృష్టించిన అన్నా హజారే నిరాహార దీక్షల నుంచి దేశాన్ని కుదిపేసిన నిర్భయ ఉదంతంపై యావత్ భారతావని గర్జించిన ఆందోళనల వరకు– ఇటీవల నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో విద్యార్థుల ఉద్యమాల వరకు ఎన్నో ప్రజా నిరసనలను, ప్రజాస్వామ్య గొంతుకలను ఈ వేదిక దగ్గరుండి చూసింది. అలా ఏళ్లుగా ప్రజాస్వామ్య పోరాటాలు, చారిత్రక ఉద్యమాలు, సామాన్యుల గొంతుకకు కేంద్రంగా నిలిచిన ప్రముఖ నిరసన వేదిక జంతర్ మంతర్ శకం ముగిసిపోయింది. దిల్లీలో శాంతియుత నిరసనల స్వరూపాన్నే పూర్తిగా మార్చేస్తూ, జంతర్ మంతర్‌ను అధికారిక నిరసన ప్రదేశం హోదా నుంచి పూర్తిగా రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది.

అసలు జంతర్ మంతర్ నిరసన వేదికగా ఎలా మారింది?

స్వాతంత్ర్యానంతరం దశాబ్దాల పాటు దిల్లీలో రాజకీయ ర్యాలీలు, నిరసనలకు ఇండియా గేట్ సమీపంలోని 'బోట్ క్లబ్' లాన్‌లే ప్రధాన వేదికలుగా ఉండేవి. పార్లమెంట్ భవనం, ప్రభుత్వ అత్యున్నత కార్యాలయాలకు అతి సమీపంలో ఉండటంతో ఇక్కడ అప్పట్లో ఆందోళనలు ఉద్ధృతంగా జరిగేవి. అయితే 1988లో రైతు నేత మహేంద్ర సింగ్ టికాయత్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో జరిగిన రైతు ఆందోళనలతో దిల్లీ నడిబొడ్డున ట్రాఫిక్ నిలిచిపోవడం, భద్రతా సమస్యలు తలెత్తడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. 1990ల ప్రారంభంలో రాజ్‌పథ్ (నేటి కర్తవ్యపథ్) పరిసరాల్లో నిరసనల కోసం వేసిన టెంట్లను ప్రభుత్వం తొలగించింది. ఇక్కడ కూడా నిరసనలు పూర్తిగా నిషేధించారు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాన్ని వెతుక్కున్న ఆందోళనకారులు క్రమంగా కన్నాట్ ప్లేస్ సమీపంలోని జంతర్ మంతర్ ప్రాంతంవైపు మళ్లారు. అప్పటినుంచి అంటే 1993 నాటికి ఇదే దేశ రాజధానిలో ప్రధాన నిరసన కేంద్రంగా అవతరించింది.

ఎన్నో చారిత్రక పోరాటాలకు వేదికైన జంతర్ మంతర్

జంతర్ మంతర్ ప్రదేశానికి సంబంధించి పెద్ద చరిత్రే ఉంది. 18వ శతాబ్దంలో ఖగోళ వస్తువులను, వింతలను, గ్రహాలు, కాల గమనాన్ని పరిశీలించడం కోసం మహారాజా సవాయ్



జైసింగ్ ×× నిర్మించిన ఈ ఎత్తైన రాతి కట్టడాల ప్రదేశమే జంతర్ మంతర్. ఈ చారిత్రక ప్రదేశం కాలక్రమేణా పాలకులపై ప్రజలకున్న వ్యతిరేకతను వ్యక్తపరిచే వేదికగా మారింది. ఇక్కడే ఎన్నో చారిత్రక ఉద్యమాలు రూపుదిద్దుకున్నాయి. అవినీతి నుంచి మహిళల భద్రత వరకు, రైతుల సమస్యల నుంచి పరీక్షల నిర్వహణలో అక్రమాల ఆరోపణల వరకు ఎన్నో అంశాలపై ప్రజలు ఇక్కడే గళమెత్తారు. ఇక్కడికి వచ్చిన జనసమూహాలే కాకుండా, వారు లేవనెత్తిన సమస్యలు, అధికారులను జవాబుదారీగా నిలబెట్టాలన్న డిమాండ్లు కూడా ఈ ప్రదేశానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. ఇక జంతర్ మంతర్ వేదికగా నిర్వహించిన వాటిల్లో ప్రజల దృష్టిని ఆకర్షించిన, చర్చనీయాంశంగా మారిన నిరసనలు, ఆందోళనలు, దీక్షల గురించి ఇప్పుడు చూద్దాం.

1993 జైల్ భరో ఆందోళన– జంతర్ మంతర్ వద్ద జరిగిన ముఖ్యమైన మొట్టమొదటి నిరసనల్లో 1993లో నిర్వహించిన ఈ జైల్ భరో కార్యక్రమం ఒకటి. ప్రభుత్వ ఆర్థిక విధానాలు, మతతత్వానికి వ్యతిరేకంగా 33 సంస్థలు కలిసి సుమారు 25 వేల మందితో ఇక్కడ భారీ ఆందోళన నిర్వహించాయి. పార్లమెంటులోనూ దీని గురించి చర్చ జరిగింది.

2011 అన్నా హజారే ఉద్యమం– ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నాహజారే 2011లో చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమంతో జంతర్ మంతర్ పేరు మరింత మార్మోగిపోయింది. జన్‌లోక్‌పాల్ బిల్లు కోసం ఆయన చేపట్టిన 5 రోజుల నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఉద్యమమే జంతర్ మంతర్‌ను తర్వాతి రోజుల్లో జాతీయ స్థాయిలో పెద్ద పెద్ద నిరసనలకు కేరాఫ్‌గా మార్చింది. 2012 నిర్భయ ఘటన– 2012లో దిల్లీలో కదులుతున్న బస్సులో ఓ యువతిపై సామూహిక అత్యాచారం ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. దేశాన్ని కుదిపేసిన ఈ నిర్భయ ఘటనపై న్యాయం కోరుతూ వేలాదిగా యువతీయువకులు ఇక్కడే రోడ్డెక్కి తమ గళం వినిపించారు.

2015 ూ=ూ= ఆందోళన– మాజీ సైనికాధికారులు వన్ ర్యాంక్ వన్ పెన్షన్ కోసం ఇక్కడ నెలల తరబడి దీక్షలు చేపట్టారు. 2017 తమిళనాడు రైతుల నిరసన– కరువు కారణంగా పంట నష్టాలకు సహాయం, రుణ మాఫీ కోసం తమిళనాడు రైతులు పుర్రెలు పట్టుకొని దాదాపు 41 రోజుల పాటు జంతర్ మంతర్ కేంద్రంగా చేసిన వినూత్న నిరసన దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది.

2019 జూూ వ్యతిరేక ఆందోళనలు– పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా 2019 డిసెంబరులో ఇక్కడ వామపక్షాలు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. 2021 రైతు కిసాన్ సంసద్– రైతు ఉద్యమ చరిత్రలో జంతర్ మంతర్ వేదికగా జరిగిన కిసాన్ సంసద్ (రైతు పార్లమెంట్) ఒక వినూత్న ఘట్టంగా నిలిచింది. 2021 జులై 22 నుంచి ఆగస్ట్ 9 వరకు రోజుకు 200 మంది రైతులతో ఇక్కడ శాంతియుత నిరసనలు చేపట్టేందుకు కోర్టు, పోలీసుల అనుమతి లభించింది.

2023 రెజ్లర్ల ఆందోళన– ప్రముఖ రెజ్లర్లు, ఒలింపిక్ పతక విజేతలు సహా పలువురు క్రీడాకారులు లైంగిక వేధింపుల ఆరోపణలపై నాటి డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా ఇక్కడే కూర్చొని నిరసన తెలిపారు. 2026 నీట్– రాజకీయ ఆందోళనలు– నీట్ పేపర్ లీక్ ఆరోపణలతో ప్రధాన ప్రతిపక్షాలు సహా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలతో జంతర్ మంతర్ పేరు దేశవ్యాప్తంగా మరోసారి మార్మోగిపోయింది.

జంతర్ మంతర్‌ను ఇప్పుడు ఎందుకు తొలగించాల్సి వచ్చింది?

గతంలోనే శబ్ద కాలుష్యం, పారిశుద్ధ్య సమస్యలు, స్థానికులకు ఇబ్బందుల కారణంగా నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఛీ+ు) 2017లో ఇక్కడ నిరసనలను నిషేధించింది. దీనిపై సుప్రీంకోర్టు 2018లో చారిత్రక తీర్పునిస్తూ– శాంతియుతంగా నిరసన తెలపడం ప్రాథమిక హక్కే అయినప్పటికీ, ప్రజాభద్రతను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలు సముచితంగా ఉండేలా ఆంక్షలు విధించొచ్చని స్పష్టం చేసింది. అయితే ఇటీవల అక్టోబర్ 10–11 తేదీల్లో జరిగిన ఉద్రిక్త ఆందోళనల నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ సిఫార్సుల మేరకు దిల్లీ ప్రభుత్వం అక్టోబర్ 12 నుంచి జంతర్ మంతర్‌ను అధికారిక నిరసన ప్రదేశం హోదా నుంచి పూర్తిగా రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దిల్లీలో నిరసనలకు ప్రత్యామ్నాయ స్థలం చూడాలని సుప్రీం కోర్టు సూచించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ప్రత్యామ్నాయ వేదికలు ఇవే

అయితే ప్రజల భావప్రకటనా స్వేచ్ఛకు, నిరసన తెలిపే ప్రాథమిక హక్కుకు భంగం కలగకుండా ప్రభుత్వం మరో 3 కొత్త ప్రదేశాలను అధికారిక నిరసన వేదికలుగా ఖరారు చేసింది. వీటిల్లో రామ్‌లీలా మైదాన్, బురారీ గ్రౌండ్, సీబీడీ గ్రౌండ్– ఈస్ట్ దిల్లీ వంటివి ఉన్నాయి. అయితే దశాబ్దాలుగా సామాన్యుల గొంతుకగా మారిన జంతర్ మంతర్– ఇప్పుడు నిరసన ప్రదేశంగా దాని అధికారిక హోదా కోల్పోవడంతో, ప్రజలు తమ గొంతును వినిపించేందుకు ఉన్న వేదికల భవిష్యత్తుపై చర్చ మొదలైంది.

రాజ్యాంగ సంస్థలను దూషించడం దారుణం

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ సహా ఇండ కూటమి నేతలు చేపట్టిన నిరసనపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని, అయితే రాజ్యాంగ సంస్థలను బహిరంగంగా దూషించడం మాత్రం ఖండించదగిన విషయమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ దిశానిర్దేశం లేకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆ పార్టీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాలంటే బాధ్యతాయుతంగా వ్యవహరించే నాయకత్వం అవసరమని అన్నారు. సోమవారం ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో కిరణ్ రిజిజు పోస్టు చేశారు. నిరసన తెలిపే హక్కును ఎవరూ ప్రశ్నించలేరని, కానీ రాజ్యాంగ సంస్థలను దూషించడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తన పనితీరును మెరుగుపరుచుకోవాలంటే ఏడాదిలో 200 రోజులు సెలవులు తీసుకోకుండా, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే నాయకుడు ఉండాలని వ్యాఖ్యానించారు. ఆ కామెంట్స్? లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించినవిగా భావిస్తున్నారు. రాహుల్ తరచూ విదేశీ పర్యటనలకు వెళ్తారంటూ బీజేపీ గతంలో పలుమార్లు విమర్శలు చేసిన నేపథ్యంలో రిజిజు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఇండీ కూటమి నేతల ర్యాలీ

మరోవైపు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్, ఇతర విపక్ష పార్టీలు ఆందోళన కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా నేతృత్వంలో ఇండీ కూటమి నేతలు సోమవారం సుప్రీంకోర్టు వైపు ర్యాలీ చేపట్టారు. ఎన్నికల సంఘం తీరును ప్రశ్నిస్తూ, ఓటు చోరీ ఆరోపణలపై న్యాయపోరాటం చేయాలనే ఉద్దేశంతో ఆ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ ర్యాలీలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ సహా ఇతర ఇండీ కూటమి నాయకులు కూడా ర్యాలీలో పాల్గొన్నారు. అఖిల భారత విద్యార్థి సంఘం (ూ×ూూ) అధ్యక్షురాలు నేహా బోరా సైతం రాహుల్, ప్రియాంకలతో కలిసి నడిచారు. ఆ ర్యాలీకి 'ప్రజాస్వామ్యం కోసం మార్చ్' అని పేరు పెట్టారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించకూడదని విపక్ష నేతలు డిమాండ్ చేస్తున్నారు.

సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు

ఇక జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కాంగ్రెస్ పిటిషన్ దాఖలు చేసింది. రాహుల్ గాంధీ ర్యాలీలోనే ఆగిపోవడంతో న్యాయస్థానానికి రాలేకపోయారు. దీంతో ఆయన తరఫున న్యాయబృందమే పిటిషన్ దాఖలు చేసింది. అంతకుముందు, ఓట్ల చోరీ అంశాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌వద్ద లేవనెత్తాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఇందుకు సంబంధించి విజ్ఞాపన పత్రం సమర్పించేందుకు తమకు సమయం ఇవ్వాలని సీజేఐని అభ్యర్థించింది. అయితే, ఇందుకు సీజేఐ తిరస్కరించారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న అంశాన్ని విపక్షాలతో చర్చిస్తే అది చట్టవిరుద్ధమే అవుతుందని జస్టిస్ సూర్యకాంత్ విపక్షాలకు లేఖ రాశారు.

దిల్లీ వీధుల్లో భారీగా పోలీసు బందోబస్తు

ఇండీ కూటమి నేతల ర్యాలీ నేపథ్యంలో దిల్లీలో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. ర్యాలీ మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు. రాజకీయ కార్యకర్తలు, పౌర హక్కుల సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ మాట్లాడుతూ, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు దిల్లీకి వచ్చారని తెలిపారు. ఎస్?ఐఆర్? ప్రక్రియను, ఓటు చోరీ ఆరోపణలను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. హరియాణా, అసోం, బిహార్ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలు, ఎన్నికల నిర్వహణలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఇప్పుడు పంజాబ్‌లోనూ అదే విధంగా జరిగే అవకాశం ఉందని తమ పార్టీ ఆందోళన చెందుతోందని అన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించకుండా చూడాలనే ఉద్దేశంతోనే ప్రజలు వీధుల్లోకి వచ్చారని వివరించారు.

కోర్టు పరిశీలనలో ఉన్న అంశాలపై సమావేశం నిర్వహించడం న్యాయ నైతికతకు విరుద్ధం

సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఈసీ విషయంలో కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున లేవనెత్తాలను కున్న సమస్యలపై విచారణ ఇప్పటికే సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఒక విషయంపై పిటిషన్ పరిశీలనలో ఉన్నప్పుడు దాని గురించి ఇతరులతో చర్చించడం రాజ్యాంగం ప్రకారం అధికార విభజన సూత్రానికి, న్యాయపరమైన ఔచిత్యానికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. సీఈసీ జ్ఞానేశ్, ఈసీ, పలువురు విద్యార్థుల అక్రమ అరెస్టులు, మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు వంటి అంశాలపై వినతిపత్రం సమర్పించేందుకు ఖర్గే, రాహుల్ గాంధీ కోరిన సమావేశ అభ్యర్థనను తిరస్కరిస్తూ సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇండియా కూటమి నుంచి తనకు వచ్చిన అభ్యర్థనపై వీరిద్దరికి మెయిల్‌లో లేఖ పంపారు.

'సుప్రీంకోర్టుకు ఆ విషయంలో ఎలాంటి అధికారాల్లేవ్'

"న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి చర్చించడం అనుచితం. అలాగే, ఆయా అంశాలపై కోర్టులో భౌతికంగా లేదా ఆన్‌లైన్ ద్వారా పిటిషన్ దాఖలు చేయాలి. ముందుగా గమనించాల్సిన విషయం ఏమిటంటే ఖర్గే, రాహుల్ పేర్కొన్న అంశాలు ఇప్పటికే భారత సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నాయి. కాబట్టి కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి చర్చించడానికి సమావేశం ఏర్పాటు చేయడం అనేది భారత రాజ్యాంగంలోని ప్రాథమిక స్వరూప సిద్ధాంతంలో అంతర్భాగమైన 'అధికార విభజన' సూత్రానికి పూర్తిగా విరుద్ధం అవుతుంది. అలాగే ఇది నైతిక విలువలు,



న్యాయపరమైన ఔచిత్యానికి కూడా విరుద్ధం. అంతేకాకుండా ఇండియా కూటమి నేతలు తమ లేఖలో ప్రస్తావించిన అంశాలను పరిష్కరించడానికి భారత రాజ్యాంగం ప్రకారం సుప్రీం కోర్టుకు ఎటువంటి పాలనాపరమైన అధికారాలు లేవు. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద ఉన్న అధికార పరిధిని వినియోగించుకుంటూ భారత పౌరులపై ప్రభావం చూపే విషయాల్లోని ప్రధానాంశాలను పరిశీలించాల్సిన బాధ్యత మాపై ఉంది" అని ఖర్గే, రాహుల్‌కు పంపిన లేఖలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. దేశంలోని ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కులను పరిరక్షించడానికి సుప్రీంకోర్టు కట్టుబడి ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. చట్టపరమైన విధానాల ద్వారా ఎప్పుడైనా సరే ప్రాథమిక హక్కుల అమలును కోరే హక్కు విపక్ష నేతలకు ఉందన్నారు. ఇదే తరహా అంశాలకు సంబంధించిన కొన్ని పిటిషన్ల విచారణ మంగళవారం జరగాల్సి ఉందని తెలిపారు. సుప్రీంకోర్టులో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల మధ్య స్వయంగా (భౌతికంగా) హాజరై సీఈసీ, ఈసీకి వ్యతిరేకంగా పిటిషన్‌ను దాఖలు చేయవచ్చని, లేదంటే 'ఈ– ఫైలింగ్' విధానం ద్వారా ఏ సమయంలోని పిల్ దాఖలు చేయవచ్చని చెప్పారు. అటువంటి పిటిషన్‌ను చట్టప్రకారం సాధ్యమైనంత త్వరగా విచారిస్తామని తాను హామీ ఇస్తున్నానని లేఖలో స్పష్టం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, భారత ఎన్నికల సంఘానికి సంబంధించిన అంశాలపై వినతిపత్రాన్ని సమర్పించేందుకు అక్టోబర్ 12న సాయంత్రం 4– 5 గంటల మధ్య సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను కలవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇండీ కూటమి నేతలు నిర్ణయించారు. ఈ క్రమంలో ఖర్గే, రాహుల్ సీజేఐకి అక్టోబర్ 10న లేఖ రాశారు. అయితే ఈ నిర్ణయాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ తిరస్కరించారు. అందుకు గల కారణాలను వివరిస్తూ ఖర్గే, రాహుల్‌కు లెటర్ పంపారు.

మోదీ సర్కార్‌పై రాహుల్ ఫైర్

కాగా, సోమవారం కాంగ్రెస్ హెడ్ క్వార్టర్స్ వేదికగా మోదీ సర్కార్‌పై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ కాపాడుతున్నారని దుయ్యబట్టారు. నిరసనల వేళ దిల్లీని ఎందుకు జైలుగా మార్చారని ఎండగట్టారు. దేశ ప్రజలు, ప్రతిపక్షాలన్నీ ఒకవైపు ఉంటే మోదీ, అమిత్ షా, అజిత్ ధోబాల్, జ్ఞానేశ్ కుమార్ మరోవైపు ఉన్నారని ఆరోపించారు. వారు ప్రజాస్వామ్యాన్ని చంపేస్తున్నారని మండిపడ్డారు. ఇది మోదీ– రాహుల్ మధ్య జరిగే యుద్ధం కాదని, దేశ యువత భవిష్యత్తు, రాజ్యాంగాన్ని రక్షించడం కోసం జరుగుతున్న పోరాటమని చెప్పారు.

ఆసుపత్రుల బిల్లులపై కేంద్రం సీరియస్

దేశవ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లు తమ వద్ద అందించే వైద్య సేవలకు వసూలు చేసే చార్జీలను అందరికీ స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. వైద్య సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతో పాటు రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్టు కేంద్రం సోమవారం స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. ఆసుపత్రులలో చార్జీల ప్రదర్శనకు సంబంధించిన నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో సమీక్షించాలని, రోగులకు, వారి సహాయకులకు చార్జీల వివరాలు సులభంగా కనిపించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె తన లేఖలో కోరారు. చికిత్స ఖర్చులను పారదర్శకంగా ప్రదర్శించడం వల్ల రోగులు, వారి కుటుంబసభ్యులు వైద్యానికి అయ్యే వ్యయంపై ఒక అంచనాకు రాగలరని, తద్వారా ఆర్థికంగా ముందే ప్రణాళిక వేసుకోవడానికి వీలవుతుందని మంత్రిత్వ శాఖ అభిప్రాయపడింది. ఇది బిల్లింగ్ విషయంలో తలెత్తే వివాదాలను తగ్గించి, వైద్య వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుందని పేర్కొంది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్–2010, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (సెంట్రల్ గవర్నమెంట్) రూల్స్–2012 ప్రకారం, ఈ చట్టం వర్తించే రాష్ట్రాల్లోని వైద్య సంస్థలు అందించే అన్ని సేవలు, సౌకర్యాల చార్జీలను తప్పనిసరిగా ప్రదర్శించాలి. ఈ వివరాలను ఇంగ్లీషుతో పాటు స్థానిక భాషలో కూడా అందరికీ కనిపించే ప్రదేశంలో ఉంచాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఆరోగ్యం రాష్ట్రాల పరిధిలోని అంశం కాబట్టి, ఈ నిబంధనలను క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి గుర్తు చేశారు. కేంద్ర చట్టం వర్తించని రాష్ట్రాలు కూడా తమ సొంత నిబంధనల ప్రకారం చార్జీల ప్రదర్శనను తప్పనిసరి చేయాలని సూచించారు. ఇదే సమయంలో భారత్‌లో చికిత్స కోసం వచ్చే విదేశీ రోగుల విషయంలోనూ పారదర్శకత పాటించాలని కేంద్రం కోరింది. మెడికల్ లేదా ఆయుష్ వీసాలపై వచ్చే వారికి అందించే ప్యాకేజీ రేట్లను కూడా ప్రముఖంగా ప్రదర్శించేలా ఆసుపత్రులను ప్రోత్సహించాలని రాష్ట్రాలకు విజ్ఞప్తి చేసింది. దీనివల్ల విదేశీ రోగులు సరైన నిర్ణయం తీసుకోవడానికి, ధరల విషయంలో ఫిర్యాదులు తగ్గించడానికి వీలవుతుందని, వైద్య రంగంలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

బంగాళాఖాతంలో అల్పపీడనం



దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వ్యవస్థ దక్షిణ బంగాళాఖాతం మీదుగా తమిళనాడు, శ్రీలంక తీరం వైపు కదులుతున్నందున దక్షిణ భారతదేశ వ్యాప్తంగా వర్షాలు ఊపందుకోనున్నాయి. దీని ప్రభావంతో ముఖ్యంగా అక్టోబర్ 14 నుంచి కోస్తాంధ్ర, తమిళనాడు తీర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 15న కూడా తీరం వెంబడి వర్షాలు కొనసాగుతాయని తెలుస్తోంది. అక్టోబర్ 16 నుంచి 19 మధ్య ఈ వర్షాలు క్రమంగా లోతట్టు ప్రాంతాలకు విస్తరించనున్నాయి. తమిళనాడులోని అంతర్గత ప్రాంతాలు, కేరళ, రాయలసీమ, దక్షిణ కర్ణాటక, కర్ణాటక తీర ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తాయి. కొన్ని చోట్ల పిడుగులు, బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. తక్కువ సమయంలో తీవ్రమైన వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో అక్కడక్కడా ఆకస్మిక వరదలు సంభవించే అవకాశాన్ని కొట్టిపారేయలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ఉపసంహరణ చివరి దశలో ఉన్నందున, బంగాళాఖాతంలో ఏర్పడుతున్న ఈ వాతావరణ వ్యవస్థ ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి దోహదపడొచ్చని భావిస్తున్నారు. అక్టోబర్ 15 నుంచి 20 మధ్య కాలంలో ఈశాన్య రుతుపవనాలు దక్షిణ భారతదేశంలోకి ప్రవేశించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడనున్నాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ అల్పపీడనం తుపానుగా మారే అవకాశం లేనప్పటికీ, గణనీయమైన వర్షపాతాన్ని ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి

భారత్‌లోకి చొరబడేందుకు యత్నం

జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) దాటి భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన నలుగురు ఉగ్రవాదులు మందుపాతరల పేలుడులో మరణించారు. వీరిలో లష్కరే తోయిబా కీలక కమాండర్ మహమ్మద్ ఫైజాన్ కూడా ఉన్నట్లు సమాచారం. కృష్ణ ఘాటి సెక్టార్‌లోని నాంగి టెక్రి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. చొరబాట్లను అడ్డుకునేందుకు సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన మందుపాతరలు పేలడంతో నలుగురూ అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. మిగిలిన ముగ్గురిని వకాస్, ఇస్తియాక్, ఆసిమ్‌గా గుర్తించారు. ఎల్ఓసీ వెంబడి భద్రతా బలగాలు ఇప్పటికే నిఘాను కట్టుదిట్టం చేశాయి. ఈ ఘటనతో అప్రమత్తమైన సిబ్బంది సరిహద్దు ప్రాంతంలో తనిఖీలు, పర్యవేక్షణను మరింత పెంచారు. కృష్ణ ఘాటి సెక్టార్‌లోని సత్వాల్–నాకి ప్రాంతంలో సోమవారం జీరో లైన్ సమీపంలో పేలుడు జరిగినట్లు అంతకుముందు సమాచారం అందింది. పాకిస్థాన్ వైపు ఎల్ఓసీ వెంబడి కదులుతున్న ఓ బృందం సమీపంలో అనుమానిత ఐఈడీ పేలినట్లు అధికారులు తెలిపారు. ఆ బృందంలో చొరబాటుకు ప్రయత్నిస్తున్న ఉగ్రవాదులు ఉన్నారా? లేక గస్తీ నిర్వహిస్తున్న పాకిస్థాన్ భద్రతా సిబ్బందా? అన్నది తొలుత స్పష్టంకాలేదు. పేలుడుకు దారితీసిన పరిస్థితులపైనా అధికారులు ఆరా తీశారు. మరోవైపు, మెంధర్ సెక్టార్‌లోని బసోని ప్రాంతంలో సరిహద్దు కంచె సమీపంలో రెండు పాత మందుపాతరలను సైన్యం గుర్తించింది. రహదారి మార్గం నిర్మాణ పనుల సమయంలో సోమవారం ఉదయం 8.25 గంటలకు ఒకటి,



మధ్యాహ్నం 12.10 గంటలకు మరొకటి బయటపడ్డాయి. సైనిక నిపుణులు నియంత్రిత పేలుళ్లతో వాటిని నిర్వీర్యం చేశారు. గత వారంలోనూ ఈ ప్రాంతంలో దాదాపు 12 మందుపాతరలను గుర్తించి నిర్వ

వైద్య కళాశాలకు శరీరదానం మహోన్నత నిర్ణయం - చంద్ర రవికి మండలి వెంకట్రామ్ పరామర్శ



చల్లపల్లి, మహానగర్

వైద్య కళాశాలకు శరీరదానం మహోన్నత నిర్ణయం అని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. మండల పరిధిలోని మంగళాపురంలో పీఏసీఎస్ సీఈఓ, రాష్ట్ర సహకార సంఘ ఉద్యోగుల సంఘ నాయకులు చంద్ర రవి తండ్రి చంద్ర సూర్యనారాయణ (82) అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుమారులు తండ్రి చివరి కోరిక మేరకు సూర్యనారాయణ శరీరం వైద్య విద్యార్థుల పరిశోధన కోసం విజయవాడ నిమ్రా మెడికల్ కాలేజీకి దానంగా ఇచ్చారు. గతంలో సూర్యనారాయణ సతీమణి మృతి చెందినపుడు కూడా ఆమె శరీరాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన కోసం వైద్య కళాశాలకు దానం చేశారు. సమున్నత నిర్ణయం తీసుకుని తల్లిదండ్రుల చివరి కోరిక నెరవేర్చిన సూర్యనారాయణ కుమారులను అభినందించారు. సూర్యనారాయణ చిత్రపటానికి నివాళులు అర్పించారు. సూర్యనారాయణ మృతి పట్ల ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. చంద్ర రవి సోదరులు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో ఎంపీ కేశినేని చిన్ని భేటీ

విజయవాడ, మహానగర్



ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయవాడ నగర సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని చాటిచెప్పేలా నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ 2.0కు హాజరుకావాలని గవర్నర్‌ను ఆహ్వానించారు. ఉత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, నగర కళా, సాంస్కృతిక ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాల వివరాలను ఎంపీ గవర్నర్‌కు వివరించారు. ఈ భేటీలో ఎంపీ కేశినేని చిన్ని వెంట కల్చరల్ కార్పొరేషన్ చైర్మన్ పొడపాటి తేజస్వి, సొసైటీ ఫర్ వైబ్రంట్ విజయవాడ సభ్యులు పాల్గొన్నారు.

వెంకన్న స్వామి అన్న సమారాధనకు రూ.1,02,116 విరాళం



గుడివాడ, మహానగర్

పాటిమీద జగన్నాథపురంలో వేంచేసిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించే అన్న సమారాధన కార్యక్రమానికి వీర్ల శివ, వెంకట శ్రావణి లక్ష్మి దంపతులు రూ.1,02,116 విరాళంగా అందజేశారు. ప్రతి శనివారం తలనీలాలు సమర్పించే భక్తులతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు నిర్వహించే అన్న సమారాధన కోసం శాశ్వత అన్నదానం నిమిత్తం రూ.92,000 చెక్కును, తమ కుమారుడు జష్ణు కార్తికేయ పేరు మీద రూ.10,116 నగదును ధర్మకర్తల మండలి చైర్మన్ లింగం శివరామ ప్రసాద్, సభ్యుల సమక్షంలో అందజేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కందులు వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదాంతం అప్పలచార్యులు దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు చందు శ్రీనివాసరావు, నిమ్మగడ్డ కృష్ణారావు, గూడపాటి సుజాత, పంతంగి హేమ, వేదాంతం కృష్ణవేణి, రాజేశ్వరరావు, సాంబశివరావు, దసరా వార్షిక కర్త యార్లగడ్డ జితేంద్రబాబు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపులిని పట్టుకునేందుకు పూణే నుంచి టీమ్స్

కొవ్వూరు

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలంలో పెద్దపులి సంచారం స్థానికంగా కలకలం సృష్టించింది. దేచర్ల సమీపంలోని క్వారీ వద్ద పెద్దపులి తిష్ట వేయడంతో ప్రజలు, రైతులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ప్రస్తుతం ఆ క్వారీ వద్దే సేదతీరుతున్న పులిని ఎలాగైనా బంధించేందుకు అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. పులిని బంధించేందుకు రెస్క్యూ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నారు.పులికి ఎలాంటి హాని కలగకుండా, అలాగే సిబ్బందికి ప్రమాదం జరగకుండా దాన్ని బంధించేందుకు అటవీ శాఖ అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. కొవ్వూరు ప్రాంతంలో పులి సంచారం దృష్ట్యా స్థానిక ప్రజలు, సమీప గ్రామాల రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను ఖచ్చితంగా పాటించాలని అటవీ శాఖ విజ్ఞప్తి చేసింది.గోదావరి జిల్లాలో పెద్దపులి దోబూతులాడుతోంది. చాలా రోజులుగా అటవీ శాఖను ముప్పుతిప్పలు పెడుతున్న పులి.. ఇప్పుడు చాగల్లు అరటితోటల్లో సంచరిస్తోంది. కొన్నాళ్లుగా పాపికొండల అభయారణ్యంలో తిరిగిన పులి కొన్ని రోజుల కిందట సీతానగరం వద్ద గోదావరి నదిని దాటింది. దేవరపల్లి మీదుగా ఇప్పుడు డెల్టా ప్రాంతానికి వచ్చేయడంతో అటవీ అధికారుల్లో ఆందోళన పెరిగింది. పులిని సాధ్యమైనంత త్వరగా బంధించేందుకు పూణె నుంచి ప్రత్యేక టీమ్‌ను రప్పించారు.ఈ క్రమంలో శనివారం ఉదయం పులి చాగల్లు సమీపంలోని ఓ అరటితోటలో రైతులకు కనిపించింది. ఆ తర్వాత ఓ ప్యాక్టరీ సమీపంలో పులి సేదతీరుతున్నట్లు కెమెరాలకు చిక్కింద. పులి అనుసరిస్తున్న వ్యూహం అటవీశాఖ అధికారులను ఆశ్చర్యపరుస్తోంది. పగటిపూట కోకో తోటలు, వరి పొలాల్లో నక్కుతూ, చీకటి పడగానే ఊర్లు మారుతూ హడలెత్తిస్తోంది. పులి కదలికలను అటవీ శాఖ అధికారులు ఛాలెంజ్‌గా తీసుకుని.. రేడియో కాలర్ సిగ్నల్స్, ప్రత్యేక డ్రోన్ కెమెరాల ద్వారా దాని జాడను ట్రాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక మత్తు ఇంజెక్షన్ నిపుణుల బృందం కూడా పులిని బంధించే ఆపరేషన్‌లోకి దిగింది. పూణె టీమ్ మాత్రం సాధ్యమైనంత త్వరగా పులిని పట్టుకుంటామని చెప్పి ఒకరోజు పూర్తయిందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

మైనారిటీ అభ్యర్థులకు గ్రూప్-2 ఉచిత శిక్షణ

అమరావతి, మహానగర్



ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేసే గ్రూప్-2 ఉద్యోగాలకు పోటీపడే అర్హులైన మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలోని మైనారిటీల విద్యాభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో ఆన్‌లైన్, ప్రత్యక్ష విధానాల్లో ఉచిత శిక్షణ అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసిందని పేర్కొన్నారు. ప్రత్యక్ష శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులకు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లు ధ్రువీకరించే తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి అర్హత్తగా పరిగణిస్తారని, దరఖాస్తు సమయంలో సంబంధిత కార్డు లేదా ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని తెలిపారు. గ్రూప్-2 ఉద్యోగాల సాధనకు అవసరమైన నాణ్యమైన శిక్షణతో పాటు విద్యాపరమైన సహకారం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. శిక్షణలో సాధారణ అధ్యయనాలు, తార్కిక విశ్లేషణ, సమకాలీన అంశాలు, రాత పరీక్ష సన్నద్ధతతో పాటు నియామక పరీక్షకు సంబంధించిన ఇతర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హత, ఆసక్తి కలిగిన మైనారిటీ అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08645-297535, 7386789966 ఫోన్ నంబర్లను సంప్రదించాలని మంత్రి ఫరూక్ కోరారు.

తక్కువ ధరకే నాణ్యమైన సన్నబియ్యం



విజయవాడ, మహానగర్

బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల నుంచి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సోమవారం విజయవాడ భవానీపురం రైతుబజార్‌లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా సబ్సిడీ ధరలకు సన్నబియ్యం విక్రయాలను ఆయన ప్రారంభించారు. ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ కన్నబాబు, జాయింట్ కలెక్టర్ ఇలక్కియతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా బీపీటీ రకం సన్నబియ్యాన్ని అందిస్తున్నామని, తాజాగా కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్ రకాల బియ్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. వినియోగదారులకు 26 కిలోల సంచుల్లో బియ్యం విక్రయించేలా ఏర్పాట్లు చేశామన్నారు. బహిరంగ మార్కెట్‌లో నాణ్యమైన సన్నబియ్యం కిలో ధర రూ.90 వరకు ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయం సామాన్యులకు ఆర్థికంగా ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మరుపిళ్ల రాజేష్, మహాదేవు అప్పాజీరావు, పెటేటి నాంచారయ్య, ఏఎస్ఎన్ మూర్తి, తిరుపతి అనూష, తిరుపతి సురేష్, మల్లేపు విజయలక్ష్మి, బొల్లేపల్లి కోటేశ్వరరావు, బొమ్ము రాంబాబు, బొమ్ము గోవిందమ్మ, రెడ్డిపల్లి అనిత, మద్దిల రామకృష్ణ, వెంపలి గౌరీశంకర్, ఏలూరి సాయి శరత్, రౌతు వాసు, పల్లంటి ఆది తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ఉత్సవ్ 2.0లో అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు





విజయవాడ, మహానగర్

కళా, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతూ విజయవాడ ఉత్సవ్ 2.0లో భాగంగా రెండో రోజైన సోమవారం పున్నమిఘాట్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. వివిధ నృత్య ప్రదర్శనలు, జానపద గేయాలు, స్కిట్స్, మరుగునపడుతున్న సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలతో పున్నమిఘాట్ సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నిర్మాత నందమూరి రామకృష్ణ, జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ కేశినేని చిన్ని, మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరై కళాకారులను అభినందించారు. నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ విజయవాడ తమ పుట్టినిల్లని, తన తండ్రి ఎన్టీ రామారావుకు, తమ కుటుంబానికి నగరంతో విడదీయలేని అనుబంధం ఉందని తెలిపారు. విజయవాడ నుంచే తమ సినీ ప్రస్థానం ప్రారంభమైందని, కనకదుర్గమ్మ ఆశీస్సులు



తమ కుటుంబంపై ఎల్లప్పుడూ ఉన్నాయని పేర్కొన్నారు. జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్ ద్వారా సంప్రదాయ కళలకు వేదిక కల్పించడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని పరిచయం చేస్తాయని అన్నారు. మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ మాట్లాడుతూ విజయవాడ ఉద్యమాలకే కాకుండా కళలకు కూడా ప్రత్యేక గుర్తింపు కలిగిన నగరమని పేర్కొన్నారు. ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎస్వీ రంగారావు, ఘంటసాల, సీతయ్య, రామోజీరావు వంటి ప్రముఖులు నగరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఎంపీ కేశినేని చిన్ని ఆహ్వానం మేరకు ఉత్సవానికి హాజరయ్యానని, దేశవ్యాప్తంగా కళాకారులకు ఒకే వేదికపై ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించడం గొప్ప విషయమని తెలిపారు. నగర కళా, సాంస్కృతిక ప్రాధాన్యతను మరింత విస్తృతంగా చాటిచెప్పేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు పట్టాభి, దూండి రాకేష్, నాగుల్ మీరా, పోతుల బాలకోటయ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ముత్తవరపు మురళి, సొసైటీ ఫర్ వైబ్రంట్ విజయవాడ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తండ్రిని కోల్పోయిన చిన్నారి భవిష్యత్తుకు భరోసా.. రూ.90 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్



మచిలీపట్నం, మహానగర్

తండ్రిని కోల్పోయిన చిన్నారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించేలా స్వేచ్ఛ ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ చేపట్టిన సేవా కార్యక్రమం అభినందనీయమని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రశంసించారు. మచిలీపట్నం సమీపంలోని తాళ్లపాలెం గ్రామానికి చెందిన పల్లేటి రాజు (20) ఆగస్టు 15న సముద్రంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతు కాగా, మరుసటి రోజు ఆయన మృతదేహం లభ్యమైంది. దీంతో భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు ఆధారాన్ని కోల్పోయారు. ఈ నేపథ్యంలో చిన్నారి పల్లేటి వాత్సల్య భవిష్యత్తుకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ట్రస్ట్ నిర్వాహకుడు షేక్ రఫీ చొరవ తీసుకుని పోస్టాఫీసులో రూ.90 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయడంతో పాటు, తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించడం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు షేక్ రఫీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాల ద్వారా నిరుపేదలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా షేక్ రఫీ మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడం, విద్యకు దూరమవుతున్న పిల్లలకు సహాయం అందించడం, ఆపదలో ఉన్న కుటుంబాలకు తోడ్పడటం తమ ట్రస్ట్ ప్రధాన లక్ష్యాలని తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు విద్యాపరంగా సహాయం అందిస్తూ వారి భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్విఘ్న ఇన్‌ఫ్రా సంస్థకు చెందిన చీతిరాల మురళీ మోహన్, కే. సుజాత, బోయిన నాగరాజు, కే. రవీంద్రబాబు, నార్కేడిమిల్లి ప్రశాంత్, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, దుర్గా, కన్యా, అంబటి శేషుబాబు, సామ సునీల్, పెల్లేటి ప్రమీల, కే. రాజు, ఎం.డి. భాషి తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

సెన్సెక్స్ 548 పాయింట్లు డౌన్.. నిఫ్టీకి నష్టాలు!

చమురు ధరలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణతో ఒత్తిడి

ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లలో అమ్మకాల ప్రభావం



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 547.65 పాయింట్లు (0.76 శాతం) తగ్గి 71,924.68 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 157.10 పాయింట్లు (0.70 శాతం) క్షీణించి 22,363.35 వద్ద ముగిసింది. అంతర్జాతీయ పరిణామాలు, పెరుగుతున్న ముడిచమురు ధరలు, విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి.

అమ్మకాల ఒత్తిడి

మార్కెట్ ట్రేడింగ్‌లో వివిధ రంగాల షేర్లలో అమ్మకాలు కనిపించాయి. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఐటీ షేర్లు సూచీల పతనానికి దోహదపడ్డాయి. అపోలో హాస్పిటల్స్, ఐటీసీ, టెక్ మహీంద్రా వంటి షేర్లు నష్టాలను చవిచూశాయి. మరోవైపు కొన్ని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు స్వల్పంగా నిలదొక్కుకున్నాయి.

మదుపరుల్లో అప్రమత్తత

అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి, ముడిచమురు ధరల పెరుగుదల, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. కంపెనీల త్రైమాసిక ఫలితాలు, ద్రవ్యోల్బణ గణాంకాలు, రూపాయి మారకం విలువ తదుపరి ట్రేడింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. స్వల్పకాలిక ఒడుదొడుకుల నేపథ్యంలో మదుపు నిర్ణయాలు తీసుకునే ముందు కంపెనీల ఆర్థిక పరిస్థితులను పరిశీలించడం అవసరం.

రూ.5,132 కోట్లకు

హెచ్‌సీఎల్ టెక్ లాభం!

క్యూ2లో 21 శాతం వృద్ధి.. ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్ ప్రకటన

ఉద్యోగుల సంఖ్యలోనూ పెరుగుదల

న్యూఢిల్లీ: ప్రముఖ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో మెరుగైన ఫలితాలను ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.4,235 కోట్లుగా నమోదైన ఏకీకృత నికర లాభం ఈసారి రూ.5,132 కోట్లకు పెరిగింది. దీంతో వార్షిక ప్రాతిపదికన కంపెనీ లాభం 21 శాతం వృద్ధి సాధించింది. ఈ ఫలితాలతో ఐటీ రంగంలో కంపెనీ పనితీరుపై మదుపరుల దృష్టి నెలకొంది.

షేర్‌హోల్డర్లకు డివిడెండ్

కంపెనీ బోర్డు 2026--27 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. కంపెనీ లాభాల్లో వాటాదారులకు కొంత భాగాన్ని పంపిణీ చేయడం ద్వారా పెట్టుబడిదారులకు ప్రతిఫలం అందించనుంది. అయితే డివిడెండ్ పొందడానికి అర్హత, రికార్డు తేదీ, చెల్లింపు తేదీ వంటి వివరాలను కంపెనీ అధికారిక ప్రకటనలో పరిశీలించాలి.

ఉద్యోగుల సంఖ్యలో పెరుగుదల

హెచ్‌సీఎల్ టెక్ ఉద్యోగుల సంఖ్య కూడా రెండో త్రైమాసికంలో పెరిగింది. త్రైమాసికంలో నికరంగా 6,450 మంది ఉద్యోగులు పెరగడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,30,339కు చేరింది. కొత్తగా చేరిన వారిలో 6,136 మంది ఫ్రెషర్లు ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి. కొత్త సాంకేతిక పరిజ్ఞానాలు, కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలకు అనుగుణంగా నైపుణ్యాలు కలిగిన ఉద్యోగులను తయారు చేయడంపై సంస్థ దృష్టి సారిస్తోంది.

రెండేళ్ల గరిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం!

ఆగస్టులో 4.83 శాతం.. సెప్టెంబరులో 5.54 శాతం

ఆహార ద్రవ్యోల్బణం 7.74 శాతానికి పెరుగుదల



న్యూఢిల్లీ: దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబరులో గణనీయంగా పెరిగింది. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా లెక్కించిన ద్రవ్యోల్బణం ఆగస్టులో 4.83 శాతంగా ఉండగా, సెప్టెంబరులో 5.54 శాతానికి చేరింది. సోమవారం విడుదలైన కేంద్ర గణాంకాల ప్రకారం ఆహార పదార్థాల ధరల పెరుగుదల దీనికి ప్రధాన కారణంగా నిలిచింది.

ఆహార ధరలే ప్రధాన కారణం

ఆహార ద్రవ్యోల్బణం ఆగస్టులో 5.97 శాతంగా ఉండగా, సెప్టెంబరులో 7.74 శాతానికి పెరిగింది. ముఖ్యంగా ఉల్లిపాయల ధరల పెరుగుదల వినియోగదారులపై ప్రభావం చూపింది. వెల్లుల్లి, నిమ్మకాయలు వంటి కొన్ని నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగాయి. ఫలితంగా కుటుంబాల నెలవారీ ఖర్చులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.

గ్రామీణ ప్రాంతాల్లో అధిక ప్రభావం

గణాంకాల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్ ద్రవ్యోల్బణం 6.08 శాతానికి చేరగా, పట్టణ ప్రాంతాల్లో 4.88 శాతంగా నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార ధరల పెరుగుదల ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల తక్కువ, మధ్యస్థ ఆదాయ వర్గాల కుటుంబాల బడ్జెట్ మరింత కుదించుకుపోయే ప్రమాదం ఉంది.

ఆర్‌బీఐకి సవాల్

ద్రవ్యోల్బణం పెరగడం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధానానికి సవాలుగా మారవచ్చు. ధరల పెరుగుదలను నియంత్రించడం ఒకవైపు, ఆర్థిక వృద్ధికి మద్దతు ఇవ్వడం మరోవైపు కేంద్ర బ్యాంకుకు కీలకంగా ఉంటుంది. అయితే భవిష్యత్తులో వడ్డీ రేట్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది తదుపరి ద్రవ్యోల్బణ గణాంకాలు, ఆర్థిక పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

ఆహార ధరల పెరుగుదలపై నిఘా, సరఫరా వ్యవస్థ మెరుగుదల, నిత్యావసర వస్తువుల లభ్యత కీలకం కానున్నాయి. ధరల పెరుగుదల కొనసాగితే వినియోగదారుల కొనుగోలు శక్తిపై మరింత ప్రభావం పడవచ్చు.

డాలర్‌పై రూపాయి దూకుడు.. ఆరు నెలల్లోనే అతిపెద్ద ర్యాలీ!



ముంబై: అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి సోమవారం గణనీయంగా బలపడింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకున్న చర్యల నేపథ్యంలో రూపాయి విలువ సుమారు ఒక శాతం పెరిగి డాలర్‌కు రూ.95.77 స్థాయికి చేరింది. అంతకుముందు ఇది రూ.96.73 వద్ద ఉండగా, ఒక్కరోజులోనే గణనీయమైన మార్పు నమోదైంది. గత ఆరు నెలల్లో రూపాయికి ఇదే అతిపెద్ద ఒక్కరోజు ర్యాలీగా వార్తా నివేదికలు పేర్కొన్నాయి.

ఆర్‌బీఐ చర్యల ప్రభావం

విదేశీ మారక మార్కెట్‌లో డాలర్ల డిమాండ్‌ను నియంత్రించేందుకు ఆర్‌బీఐ పలు చర్యలు చేపట్టింది. చమురు కంపెనీల డాలర్ల కొనుగోళ్లను స్పాట్ మార్కెట్ నుంచి ఇతర మార్గాలకు మళ్లించే చర్యలు, కొన్ని విదేశీ మారక రిస్క్ హెడ్జింగ్ నిబంధనలను కఠినతరం చేయడం ఇందులో భాగంగా ఉన్నాయి. ఈ చర్యలతో డాలర్లపై తక్షణ డిమాండ్ తగ్గి రూపాయికి మద్దతు లభించవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

దిగుమతిదారులకు ఊరట?

భారత్ ముడిచమురు అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటుంది. రూపాయి బలపడితే ఇతర పరిస్థితులు మారకపోతే దిగుమతుల రూపాయి వ్యయంపై కొంత ఉపశమనం లభించవచ్చు. అయితే అంతర్జాతీయ చమురు ధరలు పెరిగితే ఆ ప్రయోజనం కొంత తగ్గే అవకాశం ఉంది. విదేశీ విద్య, ప్రయాణం, దిగుమతి ఆధారిత వ్యాపారాల ఖర్చులపై కూడా మారకం విలువ ప్రభావం చూపుతుంది.

సవాళ్లు ఇంకా ఉన్నాయి

రూపాయి ఒక్కరోజులో బలపడినప్పటికీ, దీర్ఘకాలికంగా దాని దిశ అంతర్జాతీయ చమురు ధరలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, అమెరికా డాలర్ బలం, దేశీయ ఆర్థిక పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి తాజా పెరుగుదలను రూపాయి సమస్యలన్నీ పరిష్కారమైనట్లు భావించకూడదని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

ముగింపు: ఆర్‌బీఐ చర్యలతో రూపాయికి తాత్కాలికంగా ఊరట లభించింది. అయితే ఈ బలం కొనసాగుతుందా లేదా అన్నది రాబోయే రోజుల్లో విదేశీ మారక మార్కెట్ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

వాంఖడేలో దేశ్‌పాండే హ్యాట్రిక్ మ్యాజిక్

దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో సోమవారం పలు ఆసక్తికర పోరాటాలు జరిగాయి. ముంబై పేసర్ తుషార్ దేశ్‌పాండే హ్యాట్రిక్‌తో చెలరేగగా, సౌరాష్ట్ర ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా సెంచరీతో మెరిశాడు. ఇతర మ్యాచ్‌లలో కూడా పలువురు ఆటగాళ్లు శతకాలతో సత్తా చాటారు.

వాంఖడేలో దేశ్‌పాండే హ్యాట్రిక్ మ్యాజిక్

ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా చండీగఢ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై పేసర్ తుషార్ దేశ్‌పాండే అద్భుత ప్రదర్శన చేశాడు. తన హ్యాట్రిక్‌తో పాటు మొత్తం 5 వికెట్లు (5/17) పడగొట్టి చండీగఢ్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. అతనికి మోహిత్ అవస్థి (3/9) తోడవడంతో చండీగఢ్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 78 పరుగులకే ఆలౌట్ అయింది. అంతకుముందు ముంబై తమ తొలి ఇన్నింగ్స్‌లో 429 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీంతో చండీగఢ్‌పై ఫాలో-ఆన్ విధించిన ముంబై, రెండో ఇన్నింగ్స్‌లోనూ దేశ్‌పాండే దెబ్బకు తొలి బంతికే ఒక వికెట్ కోల్పోయి కష్టాల్లో పడింది.

శతకంతో మెరిసిన జడేజా

రాజ్‌కోట్‌లో ఛత్తీస్‌గఢ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సౌరాష్ట్ర స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కీలక సెంచరీ నమోదు చేశాడు. సోమవారం 72 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ కొనసాగించిన జడేజా, మొత్తం 209 బంతుల్లో 7 ఫోర్లతో



102 పరుగులు చేసి ఔటయ్యాడు. అదే జట్టుకు చెందిన ప్రేరక్ మన్కడ్ కూడా 129 పరుగులతో రాణించడంతో సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 392 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఛత్తీస్‌గఢ్, రెండో రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది.

ఇతర మ్యాచ్‌ల హైలైట్స్

విజయవాడలో కర్ణాటకతో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్ర సత్తా చాటింది. అరంగేట్ర ఆటగాడు ఎస్వీ రాహుల్ (100) సెంచరీతో అదరగొట్టగా, వికెట్ కీపర్ రేవంత్ రెడ్డి (97) తృటిలో శతకం చేజార్చుకున్నాడు. వీరిద్దరి 202 పరుగుల భాగస్వామ్యంతో ఆంధ్ర 331/6 స్కోరుతో 57 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది.

పంజాబ్‌తో మ్యాచ్‌లో అస్సాం 373 పరుగులకు ఆలౌట్ కాగా, పంజాబ్ తరఫున సీనియర్ పేసర్ ఉమేష్ యాదవ్ 5 వికెట్లతో రాణించాడు. బెంగాల్ తరఫున సుదీప్ కుమార్ ఘరామి (122 నాటౌట్), అభిషేక్ పోరెల్ (114 నాటౌట్) శతకాలతో మెరిశారు. డిఫెండింగ్ ఛాంపియన్ జమ్మూ కాశ్మీర్‌ను మధ్యప్రదేశ్ 120 పరుగులకే కట్టడి చేయడంలో పేసర్ అవేష్ ఖాన్ 3 వికెట్లతో కీలక పాత్ర పోషించాడు.

స్పోర్ట్స్

పంత్‌కు గాయం.. టీమిండియాలో మార్పు



న్యూజిలాండ్-ఏతో జరగనున్న మూడు మ్యాచ్‌ల అనధికారిక సిరీస్‌కు ముందు భారత-ఏ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ గాయం కారణంగా తొలి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అతడి స్థానంలో యువ వికెట్ కీపర్ బ్యాటర్ కుమార్ కుషాగ్రా జట్టులోకి వచ్చాడు. ఇటీవల జరిగిన ఇరానీ కప్ మ్యాచ్‌లో పంత్‌కు గాయమైంది. టెస్టు సిరీస్‌కు సన్నాహకంగా భావిస్తున్న ఈ సిరీస్‌కు పంత్ ఎంపిక కూడా ఫిట్‌నెస్ అనుమతులకు లోబడే జరిగింది. పంత్ మూడో మ్యాచ్‌లో ఆడటంపై మరో ?ప్రకటన త్వరలో? వెలువడుతుంది. కాగా, న్యూజిలాండ్‌లో టీమిండియా పర్యటనకు ముందు భారత్-ఏ, న్యూజిలాండ్-ఏ జట్ల మధ్య అనధికారిక టెస్ట్ సిరీస్ జరుగనుంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ అక్టోబర్ 24న, రెండో మ్యాచ్ అక్టోబర్ 31న, మూడో మ్యాచ్ నవంబర్ 7న మొదలవుతాయి.

ఈ సిరీస్ కోసం భారత-ఏ జట్టును కొద్ది రోజుల కిందటే ప్రకటించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా ధ్రువ్ జురెల్ ఎంపికయ్యాడు. ఈ జట్టులో పంత్, జురెల్‌తో పాటు భారత టెస్ట్ జట్టు రెగ్యులర్ సభ్యులు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ కూడా అవకాశం దక్కింది.

అప్‌డేటెడ్ భారత్-ఏ జట్టు

యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, రవిచంద్రన్ స్మరణ్, ధ్రువ్ జురెల్ (కెప్టెన్, వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, ఔకిబ్ నబీ, ఆకాశ్ దీప్, అన్షుల్ కాంబోజ్, మానవ్ సుతార్, ముఖేశ్ చౌదరి, సాయి సుదర్శన్, యశ్ రాథోడ్, ముఖేశ్ కుమార్, కుమార్ కుషాగ్రా (తొలి రెండు మ్యాచ్‌లకు) ఇదిలా ఉంటే, భారత్, న్యూజిలాండ్-ఏ జట్ల మధ్య సిరీస్ ముగిశాక భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ మొదలవుతుంది. ఈ సిరీస్‌లోని తొలి మ్యాచ్ నవంబర్ 19న మొదలుకానుండగా.. రెండో టెస్ట్ నవంబర్ 27న ప్రారంభం కానుంది. టెస్ట్ సిరీస్‌కు ముందు భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య 5 టీ20లు, 5 వన్డేల భారీ సిరీస్‌లు జరుగనున్నాయి.

సూపర్ ఫామ్‌లో కుషాగ్రా

21 ఏళ్ల కుషాగ్రా ప్రస్తుతం రెడ్‌బాల్ క్రికెట్‌లో మంచి ఫామ్‌లో ఉన్నాడు. తన చివరి మూడు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో రెండుసార్లు శతకాలు సాధించాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్‌తో పాటు పుదుచ్చేరిలో ఆస్ట్రేలియా-ఏ జట్టుతో జరిగిన మ్యాచ్‌లోనూ సెంచరీ నమోదు చేశాడు.

ఉప్పల్ మ్యాచ్‌కు భారీ బందోబస్తు - 408 కెమెరాలు, 8 షీ టీమ్స్?తో నిఘా



: భారత్- వెస్టిండీస్ మధ్య నాలుగో టీ20 అక్టోబర్ 14న (బుధవారం) జరగనుంది. ఈ మ్యాచ్?కు హైదరాబాద్? ఉప్పల్ స్టేడియం వేదిక కానుంది. ఇందుకోసం టీమ్‌ఇండియా జట్టు తాజాగా హైదరాబాద్ చేరుకుంది. రాజధాని నగరంలో టీమ్‌ఇండియా ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడనుండడంతో తెలుగు రాష్ట్రాల్లో ఫ్యాన్స్?కు క్రికెట్ ఫీవర్ పట్టుకుంది. మరి ఇప్పటిదాకా ఎన్ని టికెట్లు అమ్ముడయ్యాయి? అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు? అనే విషయాలు ఇప్పుడు చూద్దాం! ఉప్పల్ స్టేడియంలో సీటింగ్ కెపసిటీ గరిష్ఠంగా 55 వేలు. అంతమంది ఇక్కడ మ్యాచ్‌ను వీక్షించే అవకాశం ఉంది. అయితే బుధవారం జరగనున్న ఈ మ్యాచ్?కు సంబంధించి ఇప్పటి దాకా 25000 టికెట్లు అమ్ముడైనట్లు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తాజాగా వెల్లడించింది. ఇంకా టికెట్ సేన్ జరుగుతుండడంతో 40 వేల దాకా అభిమానులు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ మ్యాచ్? కోసం పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు, భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మల్కాజిగిరి సీపీ సుమతి వెల్లడించారు. ఇందుకోసం 2,200 మంది పోలీసులు విధుల్లో ఉండనున్నట్లు చెప్పారు. బ్లాక్ టికెట్ల సేల్?పైనా ప్రత్యేక నిఘా ఉంటుందని అధికారులు తెలిపారు. అంతేకాకుండా నిఘా కోసం స్టేడియం చుట్టూ 4 వాచ్ టీమ్‌లు, 408 సీసీ కెమెరాలు, 2 డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని అధికారులు తెలిపారు. ఇక మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, అందుకోసం 8 షీ టీమ్స్ మఫ్టీలో ఉంటాయని సీపీ పేర్కొన్నారు. వీళ్లంతా ప్రేక్షకుల భద్రత కోసం సమన్వయంతో పనిచేస్తున్నారని అన్నారు. దాదాపు 8 వేల వాహనాలు నిలిపి ఉంచేలా పార్కింగ్ కోసం స్థలం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇక బంజారాహిల్స్ హోటల్? నుంచి ప్లేయర్లు స్టేడియానికి రానున్నారు. కాగా, మ్యాచ్? కోసం అభిమానులను మధ్యాహ్నం 2 గంటల నుంచే స్టేడియంలోకి అనుమతిస్తామని సీపీ చెప్పారు. అయితే స్టేడియానికి వచ్చే అభిమానులు ఆర్టీసీ, మెట్రో సేవలను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మ్యాచ్ నేపథ్యంలో స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని పౌరులు నిబంధనలను పాటించాలని కోరారు. ఇక ఈ మ్యాచ్ కోసం ఇవాళ సాయంత్రమే భారత క్రికెట్ జట్టు హైదరాబాద్?కు చేరుకుంది. ఈ ప్రయాణంలో విమానంలో జరిగిన ఓ సరదా సన్నివేశాన్ని యువ క్రికెటర్ ఇషాన్ కిషన్ షేర్ చేసుకున్నాడు. హైదరాబాద్?కు వస్తుండడంతో ఇక్కడి ప్రేక్షకుల కోసం తెలుగులో మాట్లాడుతూ ఓ సెల్ఫీ వీడియో రికార్డ్ చేశాడు. 'హలో! హైదరాబాద్, ఎలా ఉన్నారు?' అని ఇషాన్ సరదాగా అన్నాడు. ఈ వీడియోలో అతడి పక్కన తెలుగు క్రికెటర్లు తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి ఉన్నారు. కాగా, ఐపీఎల్?లో ఇషాన్ మన సన్?రైజర్స్? హైదరాబాద్? జట్టుకే ఆడుతున్నాడు. అందుకే అతడు ఉప్పల్ స్టేడియాన్ని హోమ్ గ్రౌండ్?లాగా భావిస్తాడు.



డ్యాన్స్ షో ఆఫర్ వస్తే అనుపమ పరమేశ్వరన్ షాకయ్యిందట.. ఎందుకో తెలుసా?

రింగురింగుల జుట్టుతో కుర్రకారు మనసులో చెరగని ముద్రవేసుకుంది కేరళ చిన్నది అనుపమ పరమేశ్వరన్. మలయాళంతోపాటు తెలుగు, తమిళ భాషల్లో స్టార్ యాక్టర్లతో కలిసి నటిస్తూ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. ఈ బ్యూటీని ఒక ఆఫర్ సర్‌ప్రైజ్ చేసిందట. ఇంతకీ ఏ సినిమానో అనుకుంటున్నారా..? కాదండి.. అనుపమకు ఓ పాపులర్ డ్యాన్స్ రియాలిటీ షో నుంచి ఆఫర్ వచ్చింది. తెలుగు రియాలిటీ డ్యాన్స్ షో 'ఢీ' నయా సీజన్‌కు జడ్జిగా చేయాలని ఆఫర్ రావడంతో షాకయ్యానని చెప్పింది అనుపమ. ఈ విషయమై ఓ ఇంటర్వ్యూలో అనుపమ మాట్లాడుతూ.. సినిమాలకు అతీతంగా కొత్త అవకాశాలను అన్వేషించడం తనకు ఇష్టమని చెప్పింది. సినిమాలో తన మార్క్ చూపించిన తర్వాత షార్ట్ ఫిల్మ్, మ్యూజిక్ వీడియోల్లో నటించే అవకాశాలు వచ్చాయని... ఢీ షోకు జడ్జిగా చేయాలనే ఆఫర్ వస్తుందని తానెప్పుడు ఊహించలేదని, డిఫరెంట్ ఫార్మాట్లలో ప్రయోగాలు చేయడాన్ని ఎంజాయ్ చేయడం వల్ల తాను షో చేసేందుకు ఒప్పుకున్నానని చెప్పుకొచ్చింది. ఎప్పుడైనా కొంతగా ప్రయత్నించే ఆసక్తికరమైన అవకాశాలు వస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానంది అనుపమ. డ్యాన్స్ షోకు జడ్జిగా చేయాలని అనుపమ నిర్ణయించుకోవడం కొత్త అనుభవాలను ఆవిష్కరించుకోవాలనే తన తపనను ప్రతిబింబిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి డ్యాన్స్ రియాలిటీ షోకు జడ్జిగా ప్రేక్షకుల దగ్గర అనుపమ ఎలాంటి మార్కులు కొట్టేస్తుందనేది చూడాలి.



'మండాడి' తర్వాత సుహాస్ కొత్త సినిమా ఇదే

మండాడితో మంచి విజయాన్ని అందుకున్న సుహాస్ మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. సుహాస్ ప్రధాన పాత్రలో, రాజేంద్ర బాల దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. సంజనా కృష్ణమూర్తి కథానాయిక. కార్తికేయన్ సంతానం, వార్తికా జైన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టైటిల్‌ని 'హైడ్ అండ్ సిల్క్'గా ఖరారు చేసింది చిత్రబృందం. ఈ మేరకు సోషల్ మీడియాలో టైటిల్ ప్రోమోను విడుదల చేసింది. సుహాస్-సంజన ప్రేమ చిగురించిందని తెలుపుతూ.. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో అందరినీ ఆకర్షిస్తోంది. ఈ సినిమాలో సుహాస్ సరసన సంజన కృష్ణమూర్తి హీరోయిన్‌గా నటిస్తున్నారు. తనికెళ్ల భరణి, నందు కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాతోనే రాజేంద్ర బాల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. తెలుగు, తమిళ భాషల్లో త్వరలోనే విడుదల కానుంది.

ట్వీట్‌తో క్లారిటీ

అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో 'రాకా' చేస్తున్నాడు. దీని తర్వాత లెక్క ప్రకారం లోకేశ్ కనగరాజ్‌తో కలిసి మూవీ చేయాలి. చాన్నాళ్ల క్రితమే ఈ ప్రాజెక్ట్ గురించి ప్రకటన వచ్చింది. అనౌన్స్‌మెంట్ వీడియోని కూడా రిలీజ్ చేశారు. అప్పటినుంచి టీమ్ సైలెంట్ అయిపోయేసరికి మూవీ ఆగిపోయిందని పుకార్లు షికారు చేశాయి. గత కొన్నిరోజుల నుంచి ఈ వార్తలు తెగ వైరల్ అయ్యాయి. దీంతో అంతా ఇది నిజమేనేమో అనుకుంటున్నారు. ఇలాంటి టైంలో ఒక్క ఫొటోతో లోకేశ్ క్లారిటీ ఇచ్చేశాడు. 'ఇంట్రెస్టింగ్ అప్‌డేట్స్ త్వరలోనే' అని ట్వీట్ చేసిన దర్శకుడు లోకేశ్ కనగరాజ్.. బన్నీతో కలిసి మాట్లాడుతున్న లేటెస్ట్ ఫొటోని పోస్ట్ చేశాడు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై వార్తలన్నీ రూమర్స్ అని తేలిపోయాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా.. అనిరుధ్ సంగీతమందిస్తున్నాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి షూటింగ్ మొదలయ్యే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇతర వివరాలు ఏంటనేది టీమ్ నుంచి ప్రకటన రావాల్సి ఉంది.



మైత్రీ ఇన్ లవ్.. హీరోయిన్‌గా సడన్ సర్‌ప్రైజ్

ఒకప్పుడు హీరోగా ఎన్నో సినిమాలు చేసి ప్రస్తుతం సహాయ నటుడు, విలన్ పాత్రలు చేస్తున్న శ్రీకాంత్.. తన వారసుల్ని ఒక్కొక్కరిగా ఇండస్ట్రీలోకి తీసుకొస్తున్నాడు. ఇప్పటికే కొడుకు రోషన్.. హీరోగా మూడు మూవీస్ చేశాడు. 'ఏమో ఏమో ఇది' అని ఓ చిత్రం చేస్తున్నాడు. మరోవైపు శ్రీకాంత్ కూతురు మేధ కూడా హీరోయిన్ అయిపోయింది. ఈ మేరకు ప్రకటన చేశారు.మైత్రీ మూవీస్ నిర్మాణ సంస్థ తీస్తున్న ఓ ప్రేమకథా సినిమాతో మేధా.. హీరోయిన్‌గా పరిచయమవుతోంది. జై జాస్తి అనే కుర్రాడు హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. ఇతడు గతంలో 'రాజమండ్రి రోజ్ మిల్క్' అనే మూవీ చేశాడు గానీ అది రిలీజ్ కాలేదు. ఇప్పుడు వీళ్లిద్దరూ రొమాంటిక్‌గా ఉన్న ఓ పోస్టర్ రిలీజ్ చేసి త్వరలో ఇతర వివరాలు వెల్లడించనున్నట్లు చెప్పారు. '30 వెడ్స్ 21' అనే యూట్యూబ్ సిరీస్ తీసిన పృథ్వీ వానం ఈ సినిమాకు దర్శకుడు కాగా 'ఆంధ్రా కింగ్ తాలుకా' మూవీ తీసిన దర్శకుడు మహేశ్ బాబు.. ఈ చిత్రానికి స్టోరీ అందించాడు. శ్రీకాంత్ ఫ్యామిలీలో శ్రీకాంత్ హీరో కాగా ఇతడి భార్య ఊహ కూడా గతంలో హీరోయిన్‌గా చేసింది. ఇప్పుడు వారసుల్ని కూడా ఈ జంట.. ఇండస్ట్రీలోకి తీసుకొస్తున్నారు.



సర్దార్ డైరెక్టర్‌తో యశ్ సినిమా.. క్రేజీ టాక్ నిజమయ్యేనా?

కార్తీ హీరోగా నటించిన సర్దార్ సినిమాతో మంచి హిట్ అందుకున్నాడు కోలీవుడ్ డైరెక్టర్ పీఎస్ మిత్రన్. అయితే భారీ అంచనాల మధ్య వచ్చిన సీక్వెల్ ప్రాజెక్ట్ సర్దార్ 2 మాత్రం బాక్సాఫీస్ వద్ద ఢీలా పడిపోయింది. తాజాగా ఈ తమిళ దర్శకుడికి సంబంధించిన క్రేజీ వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. పీఎస్ మిత్రన్ ఇండియానా జోన్స్ ప్రాంచైజీ స్ఫూర్తిగా ఓ ఎక్జయిటింగ్ అడ్వెంచరస్ ఫిల్మ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడట. ఇందులో కన్నడ స్టార్ యాక్టర్ యశ్ హీరోగా కనిపించబోతున్నాడట. తాజా టాక్ ప్రకారం పీఎస్ మిత్రన్ యశ్ కథ వినిపించగా.. సినిమా ఐడియా యశ్‌కు బాగా నచ్చిందని ఇన్‌సైడ్ టాక్. ఇందులో యశ్ చాలా కొత్త గెటప్‌లో కనిపించబోతున్నాడట. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే ఈ ఇద్దరి కాంబో సెట్స్‌పైకి వెళ్లడం పక్కా అని తెలుస్తోండగా.. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. యశ్ ప్రస్తుతం నితేశ్ తివారి తెరకెక్కిస్తున్న రామాయణ సినిమాలో నటిస్తున్నాడు. ఇందులో రావణుడిగా కనిపించబోతున్నాడు యశ్. దీంతోపాటు యశ్ ప్రస్తుతమున్న ఇతర సినిమాల కమిట్‌మెంట్స్ పూర్తి చేసిన తర్వాత పీఎస్ మిత్రన్ ప్రాజెక్టు ముందుకు కదలనుందనే చర్చ నడుస్తోంది. మరి యశ్-పీఎస్ మిత్రన్ కాంబినేషన్ సిల్వర్ స్క్రీన్‌పైకి రావాలంటే ఎన్నాళ్లు వేచి ఉండాలో మరి.



PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999